# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సంపుటి 33 సంచిక 10

పేజీలు 40

జూన్ 2014

**5సం॥ల చందా రూ. 250**

**2సం॥ల చందా రూ. 120**

**సంవత్సర చందా రూ. 60**

**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్ట్ A/C Y.S.C.K.P.M

చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**

భద్రవాక్యం ........................................2
శ్రీబాబూజీ ఉవాచ....................................4
అమ్మమాట...............................................6
సన్నిధిలో సంభాషణ ...............................8
శ్రీమాతాజీ కార్యక్రమాలు ...........................9
యోగవాశిష్ఠము ......................................10
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు....................12
గిరిధారి..................................................13
ఋషభ చరితమ్.......................................15
పరిప్రశ్నేన సేవయా.................................17
వేస్తుంటే ఒక్కొక దండా మీ మెడ నిండా............18
భగవద్గీత - వర్తమాన సమాజం.............19
శ్రీకృష్ణకర్ణామృతము...............................21
ఏకత్వదృష్టి .........................................23
వ్యోమవద్వ్యాప్త దేహోయ.........................25
క్షీర చోరుడు..........................................27
ఆశ్రమ పాఠశాల.....................................29
శ్రీ దత్తాత్రేయుడు-పరశురామ సంవాదం....30
ముముక్షువు వెంకటరమణ ప్రసాద్ ..........31
సత్సంగామృతం.......................................33
ప్రైస్ లిస్ట్..............................................35
సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర...........37
విష్ణు కథలు - సదాశివ బ్రహ్మేంద్రసరస్వతి....39

# భద్రవాక్యం

– పరాశర ప్రసాద్

రాహుగ్రస్థ దివాకరేందు సదృశో మాయా సమాచ్ఛాదన
తన్మాత్రః కరణోపసంహరణో యోభూత్సుషుప్తః పుమాన్
ప్రాగస్వాప్సమితి ప్రబోధ సమయే యఃప్రత్యభిజ్ఞాయతే
తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయేనమః
(దక్షిణామూర్తి స్తోత్రం)



ఆదిశంకరులు రచించిన దక్షిణామూర్తి స్తోత్రం అద్వైత సిద్ధాంత శిరోమణి. ఘన స్వరూపము ధరించిన జ్ఞానమే దక్షిణా మూర్తి. స్త్రీలతో కలసి ఉన్నాడని, జిజ్ఞాసా పరులైన సనక సనందులు, నారదుడు, త్రిమూర్తులను తిరస్కరించి వెళ్లిపోతున్న వారికి పరమ దయాళువైన శివుడు జ్ఞానాన్ని బోధించే నిమిత్తము వారి మార్గ మధ్యంలో వట వృక్షం క్రింద సుందరమైన యువకుని రూపంలో దక్షిణముఖంగా చిన్ముద్ర ధరించి కూర్చున్న దక్షిణామూర్తి ప్రసాదమే యీ శ్లోకము.

జీవుడు అను దినము జాగ్రత్స్వప్న సుషుప్తులు అనుభవిస్తున్నా, గాఢ సుషుప్తిలో ఏ అనుభవమూ లేకపోవుట చేత, ఆత్మ ఉనికిని సందేహించటానికి తావు ఉన్నది. అటువంటి శూన్యవాదులకు యీ శ్లోకం ఉపకరిస్తుంది. గ్రహణ సమయంలో రాహువు, సూర్యచంద్రుల కాంతి బహిర్గతం కాకుండా ఎలా అడ్డుకుంటుందో, అదే విధంగా గాఢ సుషుప్తిలో మాయ అనే అజ్ఞాన ఆవరణ ప్రభావం చేత, ఇంద్రియాలు, మనస్సు విశ్రాంతిలో ఉండి, చైతన్యం యొక్క ప్రకాశాన్ని అందుకో లేక పోతున్నాయి. గ్రహణ సమయంలో సూర్యచంద్రుల యొక్క ప్రకాశం మనకు గోచరించక పోయినా, లేకుండా పోలేదు కదా! అలాగే చైతన్య దీప్తిని మనస్సు యింద్రియాలు గ్రహించలేకపోతున్నాయి.

అయితే కరణాలు ఉంటేనే చైతన్యం స్ఫురించటమేమిటి, అది స్వతఃసిద్ధం కదా అనే అనుమానం రావచ్చు. మనస్సు ఉంటేనే నేను

వున్నాను అనే భావన చేయటం, లేకుంటే లేనట్లు ఎంత వాస్తవమో యిదీ అంతే. నేను అనేది మనస్సుకి అతీతంగా ఉంటుంది. అది నిరంతరాయంగా ప్రకాశిస్తున్నా, మనస్సు దాన్ని అభివ్యక్తం చేస్తోంది.

అద్దంలో ఒక వస్తువు గోచరిస్తుంటే, అద్దం ఆ వస్తువును సృష్టించిందా? లేదు కదా! అద్దం ఉన్నా, లేకపోయినా ఆ వస్తువు ఉంది. అయితే ఆ వస్తువు ఉన్నట్లు మనకు తార్కాణమేమిటి? అనే ప్రశ్న వుదయిస్తుంది. సుషుప్తిలో ప్రకాశించటం లేదని, చైతన్యం లేదని అనగలమా? సుషుప్తిలో చైతన్యం లేకపోతే జాగ్రదావస్థలో ఆ సుషుప్తి అనుభవం ఎలా స్ఫురణకు వస్తోంది? మెలుకువ రాగానే నిద్రావస్థలో విషయాలను గుర్తుకు తెచ్చుకోవటమే ప్రత్యభిజ్ఞ అనవచ్చు. అభిజ్ఞ వుంటేగా ప్రత్యభిజ్ఞ కలిగేది. అభిజ్ఞ అంటే ప్రత్యక్షానుభవం. ప్రత్యభిజ్ఞ అంటే అనుభవించిన దానిని గుర్తుకు తెచ్చుకోవటం.

## స్థైర్యం

**తన గుడ్లను నాశనం చేసిన సముద్రుడిపై కోపం వచ్చిన టిట్టిభ పక్షి (తీతువు) తన ముక్కున గడ్డిపోచను కరచుకుని, సముద్రంలో ముంచి దానికంటుకున్న బిందువులను ఇసుకలో వేసి - సముద్రాన్ని యింకింప జేస్తానని ప్రతిజ్ఞ బూనింది. 'కార్యం వా సాధయామి, దేహం వా పాతయామి' యిదే దాని నిర్ణయం.**

**నారదుడు ప్రేరేపించగా గరుడు వచ్చి, సముద్రుణ్ణి బెదిరించి గుడ్లను తెప్పించి యిచ్చాడు. ప్రయత్నపరులకు భగవంతుడు ఏదో రూపంలో వచ్చి తప్పక సహాయ పడతాడు.**

- డా॥ వి.వి.ఆర్ ప్రసాదరావు

# శ్రీ బాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులనుద్దేశించి మాట్లాడుతూ 'గురుమూర్తికి నేనంటేనే ఇష్టము. ఎప్పుడూ ఆయన చెంతనే ఉండాలి అన్ని సేవలూ నేనే చేయాలి. అనే భావన మమకారము కాదా?' అని ప్రశ్నించిన భక్తునికి సమాధానంగా "అటువంటి భావన సరియైనది కాదు. సద్గురు మూర్తి సర్వవ్యాపకుడు, సర్వ రక్షకుడు, సర్వేశ్వరుడు అనే భావన యదార్థమైనది. అఖండమైనది. గురుమూర్తిని ఖండ దృష్టితో చూడటం కేవలం అజ్ఞానమే. ఆయన ప్రేమించేది నీలో ఉండే సత్యాన్ని ధర్మాన్ని అంతేగాని ఆయనకి వ్యష్టి భావన ఉండదు. ఆయనది సమదృష్టి. మహాత్ముల దృష్టి ఎలా వుంటుందో మీకు ఒక ఉదంతం చెపుతాను.



షిరిడీ సాయిబాబాని విందుకు ఆహ్వానించారు. ఆయనకు ఒక స్థానాన్ని కేటాయించి ఆయన రాకకోసం అందరూ ఎదురు చూస్తున్నారు. అందరూ ఆయన ప్రక్కనే కూర్చోవాలని ఆకాంక్షిస్తున్నారు. అందరూ నిలబడి వున్నారు విషయం అర్థంచేసుకున్న బాబా మాట్లాడుతూ మీ అందరికి నేను కావాలి కాని నాకు మాత్రం మీ అందరూ కావాలి అందువలన మీరంతా కూర్చోండి మీ అందరికి నేను వడ్డన చేస్తాను అన్నారు. చూశారా! మహాత్ముల దృష్టి ఎలా ఉంటుందో! భగవంతుని పొందటానికి గాని, సద్గురు మూర్తి ప్రేమని పొందటానికి చేసే ప్రయత్నము మమకారము కాదు. నేను, నాది అనే భావనే మమకారము. మమకారానికి సంకేతము కన్ను, కంటి ద్వారా దర్శించిన దానిని పొందాలనే సంకల్పము కల్గుతుంది. మమకారానికి ప్రధాన హేతువు ఈ దేహము నాది, నేను అనే భావన.

ఈ దేహము నాది అనే భావన ద్వారా నా దారా పుత్రులు, నా బంధువులు, నా స్నేహితులు, నా యిల్లు, నా కులము, నా జాతి, నా గోత్రము, నా ఊరు అనేవి ఉత్పన్నము అవుతున్నాయి. ప్రాపంచిక ప్రేమలు, బాంధవ్యాలు అస్థిరమైనవి, అశాశ్వతమైనవి. ఎంతో గాఢంగా ప్రేమించిన

భార్యాపిల్లలు ఒక వ్యక్తి మరణించినపుడు దగ్గరకు రావడానికి కూడా భయపడతారు కదా! భార్య కొలది గంటలు నిద్రాహారాలు మాని దుఃఖించవచ్చు. ఇంతలో పెద్ద కుమారుడు హెచ్చరిస్తాడు. 'చనిపోయిన వారితో మనము చనిపోతామా' అని. దానితో ఇంట్లో కొంత మార్పు వస్తుంది. చూశారా ప్రాపంచిక ప్రేమలు మమకారాలు ఎలా వుంటాయో! ఇవన్నీ అనుభవిస్తూ మానవుడు ఏమన్నా మారతాడా? ఆక్షణంలో మాత్రం ప్రతివాడికి శ్మశానవైరాగ్యం కల్గుతుంది. ఎవరైనా ఇంతేకదా? ఎప్పటికైనా ఈ దేహం నశించేదే కదా అనుకుంటాడు. కాని ఆమరుక్షణమే అన్నీ మరచిపోతాడు. అలా మరచిపోవటమే మానవ స్వభావము" అన్నారు.

శ్రీ బాబూజీ మహరాజ్ ఇంకా మాట్లాడుతూ "పెద్దగాలి, వాన, వరద వచ్చి ఊరంతా మునిగి పోయింది. తనకు ఉన్న సామాను, సొమ్ము మూటకట్టుకుని భార్యాపిల్లలతో నీటి ప్రవాహంలో ఈదుకుంటూ వెళ్ళాడు. ప్రవాహం ఎక్కువైంది. ముందుగా సామాను వదలి వేసాడు. ఆ తర్వాత పిల్లల్ని అటు పిమ్మట భార్యని వదిలివేసాడు. చూశారా తాను ప్రేమించే దేహం కోసం అన్నింటినీ త్యాగం చేశాడు. అదే మమకారం అంటే. మమకారాన్ని జయించాలంటే గురుబోధా శ్రవణం చేయాలి. శ్రవణం చేసిన బోధని మననం చేయాలి. మననం ద్వారా మనస్సు బుద్ధిలో లయమై వివేకం కల్గుతుంది.

వివేక వంతమైన విచారణ ద్వారా సమాధి స్థితిని పొంద గల్గుతావు. మననము లేక విచారణ ఎంత గొప్పదో ఒక దృష్టాంతము చెప్తాను. మీ నిత్య జీవితంలో ఏదైనా మధురమైన అనుభూతిని పొందారనుకోండి. ఆ క్షణంలో మీరు ఆనందించి ఉండవచ్చు. కాని ఆ అనుభూతిని ఎప్పుడైనా తలుచుకొని మీరు పొందే అనందం అంతకన్నా ఎక్కువగా ఉంటుందేమో. ఇది మీ అందరికి అనుభవమే కదా! అలాగే మీరు శ్రవణం చేసిన సద్గురుమూర్తి బోధని మననం చేసుకున్నప్పుడు ఆనందాన్ని ఇవ్వకుండా ఉంటుందా!

# అమ్మమాట

-జపమాలా ప్రసాద

## మూలాన్ని గుర్తించు

(6-3-2014 నిడమర్రు శ్రీబాలవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో జరిగిన సత్సంగ సమావేశము నుండి)

"బాహ్య విషయాలు, ధనధాన్యాలు ఈయలేని అలౌకిక ఆనందం మనకి భగవత్ సంబంధిత కార్యాలలో దొరుకుతోంది. అందరూ ఏరుకొని తీసుకుని వెళ్ళిపోయాక, మిగిలిపోయిన పుచ్చువంకాయలను తీసుకున్నట్లు, ప్రపంచంలో అందరూ అనుభవించి, అనుభవించి వదిలి వేసిన విషయాలనే మళ్ళీ 'వమనాన్నవత్' (అంటే వాంతి చేసుకున్న దానినే తీసుకుతిన్నట్లు) మానవులు అనుభవిస్తున్నారు.

చిల్లు కుండతో నీళ్ళు తెచ్చుకోగలమా? అలాగే, యీ నవద్వారాలు కలిగి ఉన్న దేహంతో, ఇంద్రియాలనే చిల్లులు కలిగిన కుండతో, జ్ఞానం సంపాదించటం చాల కష్టం. జన్మజన్మల నుండి బాహ్య ముఖంగానే ప్రవర్తించే జ్ఞానేంద్రియాలు, అంతర్ముఖమయితే తప్ప, జ్ఞానం కలుగదు. దీనికి సాధకుడయినవాడు సత్వగుణాన్ని వృద్ధి పొందించు కోవాలి. కేవలం మనం తినే ఆహారం మాత్రం సత్వ ప్రధానమయితే చాలదు. మనం వినేది, చూచేది, ఆఘ్రాణించేది - అన్నీ కూడా సత్వగుణ ప్రధానమై ఉండాలి.

మన నిత్యజీవితంలో చేసే పనులు మన సాధనపై ప్రభావం చూపుతాయి. చాలా మందికి ఉదయం లేవగానే న్యూస్‌పేపర్ చదివే అలవాటు ఉంటుంది. ఆ చివరి నుండి యీ చివరి వరకూ చదవటమే కాకుండా, ఆ విషయాలను పదిమందితోనూ చర్చించడం, చదవని వారికి వినిపించడం కూడా చేస్తారు. దీని వలన ఉపయోగమేమిటి? అందుకే దాని పేరు 'న్యూస్‌పేపర్' కాదు 'న్యూసెన్స్ పేపరు' అంటాను. నువ్వు పేపర్లో ఒక దుర్వార్తే చదివావు. ఆ దుర్ఘటన గురించి అనవసర ప్రసంగాలు చేసేకంటే, ఆ ఘటనకు నష్టపోయిన వారి గురించి నువ్వు చక్కగా ప్రార్థన చేసుకుంటే, వారికి మంచి జరుగుతుందని శ్రీగురు దేవులు ఎప్పుడూ చెప్పేవారు. మనకి అవసరమైన వాటినే వినాలి, అవసర

మైనంత వరకే మాట్లాడాలి.

శ్రోత్రం చక్షుస్స్పర్శనంచ। రసనం ఘ్రాణమేవచ।
అధిష్ఠాయ మనశ్చాయం। విషయానుపసేవతే॥
(భ.గీత15/9)

మన పంచ జ్ఞానేంద్రియాలైన శ్రోత్రం (చెవి), చక్షువు (కన్ను), త్వగింద్రియం (స్పర్శ), రసనేంద్రియం (నాలుక), ఘ్రాణేంద్రియం (ముక్కు), ఈ అయిదింటికి అధిష్ఠానం (మెయిన్ స్విచ్) అయిన మనస్సు బాహ్యవిషయాలను సేవిస్తుంది. పేరుకి జ్ఞానేంద్రియాలయినా అవి మనకి బాహ్య ప్రపంచపరమైన జ్ఞానాన్నే యిస్తున్నాయి.

అనంతమైన శక్తి మనలో ప్రకాశిస్తున్నది. ఆ శక్తే, మన మనస్సునీ, ఇంద్రియాలను కూడా ప్రకాశింపజేస్తోంది. ఆ శక్తి అంతటా సర్వే సర్వత్రా ప్రకాశిస్తోంది. దానిని గుర్తించాలి అంటే మనస్సు దాని వైపు తిరగాలి అంటే అంతర్ముఖమవ్వాలి. అంతటా ప్రకాశించటమనేది దేవుని లక్షణం. దానిని ఎల్లవేళలా, ఎల్లయెడలా వెతికి చూస్తే అది తప్పక గుర్తించ గలుగుతాము. 'ఇందుగలడు అందు లేడని సందేహంబు వలదు। చక్రి సర్వోపగతుండు ఎందెందు వెదకిచూచిన అందందేగలడు దానవాగ్రణి <u>వింటే</u>!' - అన్నాడు ప్రహ్లాదుడు.

<u>వింటే</u> అనేది అండర్‌లైన్ చేసుకోవాలి. వెదకాలి. ఇవి రెండూ ముఖ్యం. శ్రీగురుదేవుల అనుగ్రహ శిక్షణ మనని గంటల తరబడి కూర్చోబెట్టేది. అదీ సాధన అంటే. మనకి తెలియకుండానే మనచేత సాధన చేయించారు స్వామి. 'సన్న్యస్య శ్రవణం కుర్యాత్' అన్న శబ్దం అప్పుడు మనకి తెలియక పోయినా, మన అనుభవం అదే.

-సశేషం

**శాస్త్రజ్ఞానం చిలుక పలుకుల వంటిది. అది మిమ్మల్ని తరింప జేయ జాలదు. అనుభవ జ్ఞానం కావాలి.**

- శ్రీ కాళీ బాబు

# సన్నిధిలో సంభాషణ

– పరాశర ప్రసాద్

17-12-1985

శ్రీబాబు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ "పండితులంతా కలిసి రాధా కృష్ణుల ప్రేమకి వక్రభాష్యం చెప్పి పరమాత్ముడికి గుణాలను అంటకడుతున్నారు. వేదాలు, పురాణాలు అన్నీ పరమాత్ముడిని గుణరహితుడని ఘోషిస్తున్నాయి కదా! ఇది న్యాయమేనాండి? దీనిని మీరు అంగీకరిస్తారా? చంద్రుడు లేని చంద్రకాంతి వుంటుందా? అలాగే కృష్ణ పరమాత్ముడు పురుషుడు. రాధ ప్రకృతి. పరమాత్మశక్తి లేనిదే ప్రకృతి ప్రకాశిస్తుందా? భక్తుడు ప్రకృతి. భగవంతుడు పురుషుడు. భగవానుని శక్తి లేనిదే ప్రకృతి జడమే కదా! మరి అటువంటి పరిస్థితిలో రాధాకృష్ణులది విరహమని, విరహ తాపమని కవులు వర్ణించటమేమిటి?



శ్రీకృష్ణ పరమాత్ముని దర్శనమాత్రం చేతనే దశేంద్రియాలు లయించిపోయి తాపత్రయము రహితమవుతుంది కదా! అటువంటి రాధాకృష్ణుల ప్రేమని జయదేవుడు అనుభవ పూర్వకంగా దర్శించి రచించాడు. దానిని అపార్థం చేసుకున్నారు" అన్నారు.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ "భక్తుడు మానససరోవరంలోని తామరపుష్పం లాంటివాడు. తుమ్మెద 'ఓం' అంటూ ప్రణవనాదం చేస్తూ ఆ తామర పువ్వు చుట్టూ తిరుగుతూ ఆ తామర పుష్పంలోని మాధుర్యాన్ని గ్రోలుతూ ఆలాగే ఉండిపోతుంది. తామరపువ్వు ముడుచుకుపోయి ఆ తుమ్మెదని తనలోనే బంధిస్తుంది. అలాగే పరమాత్ముడు భక్తుని యొక్క హృదయ కమలము పరిపూర్ణ భక్తితో వికసించగానే ఆ కమలంలోని మాధుర్యాన్ని గ్రోలటానికి హృదయంలో నిలిచిపోయి బందీ అయిపోతాడు. అదే భగవానుని నివాస స్థలం అవుతుంది. చూశారా తుమ్మెద ఏ విధంగా మధువు కోసం తామరపుష్పం చుట్టూ ఝూంకరిస్తూ తిరుగుతుందో అలాగే పరమాత్ముడు భక్త హృదయం కోసం వెతుకుతాడు. అందుచేత నిరంతర భగన్నామము చేయాలి. అలా చేస్తే భగన్నామమనే విందు ఆరగించటానికి గోవిందుడు నీ హృదయంలో ప్రవేశించి కలుషాన్ని

హరించి శుభ్రం చేస్తాడు. కాబట్టి జ్ఞాని నిత్యానంద స్థితిలో ఉంటాడు. ఆయన హృదయంలో ఏ రకమైన మలినము ఉండదు. అహంకారము ఉండదు. సంకల్పములుండవు. ఈర్ష్య, అసూయలు ఉండవు. విషయ వాసనలుండవు. హృదయమంతా ప్రేమతో నిండి ఉంటుంది. అటువంటి మానవుడు మాధవుడిగా వ్యవహరింపబడతాడు. మనీషి అవుతాడు. అతడే జ్ఞాని.

హృదయంలో ఏ మాత్రం మాలిన్యం ఉన్నా అతడు జ్ఞాని అనిపించుకోడు. గుణములతో కూడి ఉన్న వాడు మహిషిగా వ్యవహరింపబడతాడు. ఇది నా research లో తెలుసుకున్న విషయం. శాస్త్రాలు, నవలలు చదివిన విద్యావంతులందరూ తావే విజ్ఞానవంతులమని తామే research చేసిన వాళ్ళమని భావిస్తారు. కాని నిజమైన research అంటే అది కాదు. మనస్సు పరమాత్మని యందు లగ్నమై, పరమాత్మని చరిత్రని చదివి, అనుభవించి, తెలుసుకోవలసినది తెలుసుకున్న స్థితి, నిజమైన research అనిపించుకుంటుంది" అన్నారు.

## శ్రీ మాతాజీ కార్యక్రమాలు

1)5-5-14 నుండి 23-5-14 వరకు భక్తులతో కలసి ఉత్తరదేశయాత్ర

2) 26-5-2014 నుండి 31-5-2014 వరకు పావులూరు శాఖలో (ఇంకొల్లు మండలం, ప్రకాశం జిల్లా) శ్రీ అవధూతేంద్ర సరస్వతీ స్వామివారి నవ త్రింశతి (39వ) పుణ్యారాధన మహోత్సవములు, సత్సంగ సమావేశములు, అఖండ హరినామ సంకీర్తన.

3) కెనడా, అమెరికా పర్యటన -

| | |
|---|---|
| జూన్ 7 నుండి 13 వరకు | - కేలగరీ, కెనడా. |
| జూన్ 14 నుండి 20 వరకు | - చికాగో, షాంపైన్. |
| జూన్ 21 నుండి 27 వరకు | - సెయింట్ లూయీస్. |
| జూన్ 28 నుండి జులై 7 వరకు | - మినియా పొలిస్ |

జులై 4 నుండి 6 వరకు సత్సంగములు జరుగు ప్రదేశము -

E.V.N. Kishore kumar
10178, Indigo Dr., Eden Prairie,
Minnesota-55347
Mobile NOs. Kishore - (573) 356 3723
Rajani - (732) 877 8516

(గత సంచిక తరువాయి)

# యోగవాశిష్ఠము

-సుషుమ్న ప్రసాద

వృద్ధాప్యముతో, కుటుంబ చింతలతో నేను చిక్కి శల్యమైనాను. ఆ బీటు వారిన అరణ్యంలో వేసవివేడి, శీతాకాలపు వణికించే చలి వలన, అనేక బాధలకు నేను మాసిపోయిన చింకి వస్త్రాలను ధరించవలసి వచ్చింది. నెత్తిపై ఎన్నో కట్టెల మోపులు మోశాను. కరుడు కట్టే చలితో వణికి పోయాను, చెట్టు వేరులు తిని బ్రతక వలసి వచ్చింది.అలా అరవై సంవతత్సరాల బడుగు జీవితాన్ని సాగించాను. ఈ అరవై సంవత్సరాలు ముగిసేటప్పటికి, యెన్నో కల్పాలు గడచినట్ల అయింది. అప్పుడా ప్రదేశంలో భయంకర కాటకము వచ్చి, ఎంతో మంది ఆకలితో మృతి చెందారు. మా బంధువులు కొంతమంది ఆ దేశాన్ని వదలి వెళ్ళారు.



నేను " నా భార్య పిల్లలతో ఆ దేశాన్ని వదలి మండు టెండలో నడవటం ప్రారంభించాము. ఇద్దరు పిల్లలను భుజాలపై యెక్కించుకొని. ముడవ వాడిని తలపై మోశాను. అలా చాలా దూరం నడిచిన తర్వాత, అడవి అంచులకు వచ్చాము. అక్కడ చెట్టు నీడలో కొంచెంసేపు విశ్రాంతి తీసుతొన్నాము. మండుటెండలో సుదూర ప్రయాణంవలన, నా భార్య చనిపోయింది.

ఇంతలో ' ప్రాచిక ' యని పిలవబడే నాచిన్న కొడుకు నిద్రలేచి నా ముందు నిలబడి, కన్నీరు కారుస్తూ " నాయనా! నాకు చాలా ఆకలిగా ఉన్నది, తినటానికేదైనా మాంసము, త్రాగటానికి నీరు యివ్వక పోతే నేను బ్రతకలేనని ఏడ్చాడు. కన్నీరు మున్నీరుగా కారుస్తూ ఆకలితో దహించికు పోతున్నానని, ఆహారం లేకపోతే మరణిస్తానని, మరల మరల చెప్పాడు. ఆ బాధ తట్టుకోలేక తనువు చాలిద్దామని నిర్ణయానికి వచ్చాను.

కొంత కలపను సేకరించి, కట్టెల లోతదానిపై నొకటి పేర్చి, నిప్పంటించాను. నిప్పులో దూకుదామని, లేచి నిలబడ్డాను, అప్పుడే నేను సింహాసనము పైనుండి క్రిందపడి, కనులు తెరచి స్పృహలోకి

వచ్చేటప్పటికి, మేళ తాళాల ధ్వనులు విన్నాను. మీరందరూ నన్ను లేవదీసి మహారాజుకు జయము కలుగుగాక! జయహో! అంటూ మీరు చేసే హర్షధ్వనులను విన్నాను. అప్పుడు నేను చండాలుడను కాను, లవణ మహారాజుననే స్మృతికి వచ్చాను. ఇప్పుడు నాకర్థమైనది ఆ సిద్ధుని యింద్రజాల ప్రభావముతో చాలా కాలము ఊహాజనితమైన కష్టాలకు లోనైనాను. వెంటనే మంత్రులు, ఆసిద్ధుని పూర్వాపరాలను గురించి, పరిశోధన చేశారు. ఇంతలో సాంచారిక యని పిలవబడే సిద్ధుడు అదృశ్యమైనాడు.

అప్పుడు వశిష్ఠ మహర్షి యిలావివరించారు. "ఓ రామా ! ఆ సిద్ధుడు దివ్య మాయారూపం తప్ప మరొకటి కాదు. ఈ కథ వలన మనం విశ్వమంతా మనో జనితమని గ్రహిస్తున్నాము. పరబ్రహ్మమే ప్రపంచముగా, మనసుగా గోచరిస్తుంది. కలలో నీవు వంద సంవత్సరాల అనుభవాన్ని, ఐదు నిమిషాలలో అనుభవిస్తావు. మనసును యేకాగ్రతచేస్తే, ఒక గంట ఐదు నిమిషాలుగా స్ఫురిస్తుంది. ఏకాగ్రత లేకపోతే పది నిమిషాలు మూడు గంటలుగా అనిపిస్తుంది. ప్రతివారికి ప్రపంచములో యిలాంటి అనుభవమున్నది. ఈ కథలో లవణ మహారాజు రెండు గంటలలో 60 సంవత్సరాలు అనుభవాన్ని పొందారు.

"ఈజగత్తంతా మనసుచే సృజింపబడ్డది. మనసు లేక మాయ కంటే గొప్ప మాంత్రికుడు లేక యింద్రజాలికుడు మరొకడు లేడు. ఈకథలో మనసు లేక మాయయే సిద్ధుడిగా గోచరించాడు. మనసే మాయ. మనసు మాయ యొక్క పనిముట్టు. లవణ మహారాజు యొక్క అనుభవాలు, కోరికలు, ఆరాటం, ప్రాపంచిక విషయాలకు బానిసలయిన మానవుల యొక్క బాధాకరమైన స్థితికి ప్రతిబింబము. ఈమాయా జనితమైన జగత్తంతా భగవంతుని సర్వ సమర్థతకు, అపారమైన శక్తికి నిదర్శనము మాత్రమే. ఈప్రపంచములోని జీవులంతా మాయతో మోసపోతున్నారు. వారు అసత్యమైన విషయ పరంపరను సత్యంగా నమ్ముతారు. సత్యము, నిత్యమూ వారికి అసత్యము, అనిత్యముగా భ్రమచెందుతారు. వృక్షమెలాగ తన కొమ్మలతో, రెమ్మలతో విస్తృతమౌతుందో, అలాగే మనసు తన ఊహతో సృజింప బడిన వాటితో విస్తృత మవుతుంది.

-సశేషం

# శ్రీ కాళీ గార్డెన్స్ కార్యక్రమాలు

జూన్ 2014

7 శని : శ్రీసుగుణ ప్రసాదమాతాజీవారి సప్తమ వార్షిక పుణ్యారాధన.

13 శుక్ర : పూర్ణిమ శ్రీ సద్గురుపాద పూజ.

22 ఆది : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

25 బుధ : మాసశివరాత్రి

27 శుక్ర : అమావాస్య

జులై 2014

8 మంగళ : తొలి ఏకాదశి, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

12 శని : ఆషాఢ పూర్ణిమ, సత్సంగం, సద్గురుపాదపూజ, భక్తసమారాధన, చాతుర్మాస్య దీక్ష ప్రారంభం.

17 గురు : కర్కాటక సంక్రమణం దక్షిణాయనం ప్రారంభం.

21 సోమ : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

25 శుక్ర : మాసశివరాత్రి.

26 శని : అమావాస్య.

లాంతరు బయట తుడిస్తే ప్రయోజన మేముంది? లోపల తుడిస్తే దీప దర్శనం అవుతుంది. అటులనే మనసుకు పట్టిన మకిలిని భగవన్నామ స్మరణతో తుడిచివేసుకో గలిగితే ఆత్మానందం మీ సొత్తు అవుతుంది. అది ధరణి రుచుల కన్న మిన్న అయినది.

సముద్రపు అంచున హెూరు వినబడుతుంది. కాని సముద్రపు మధ్యకు వెడితే హెూరు వినబడదు. అనగా సంకల్పాలను జయించాక నిర్మల స్థితి లభిస్తుందని భావం.

- శ్రీ కాళీప్రసాద బాబు

# గిరిధారి

- కామేశ్వరీ ప్రసాద

బృందావనంలో గోప, గోపికలందరూ కలసి ప్రతియేటా వసంతోత్సవాలు చేసుకునేవారు. ఆయేడు కూడా వృద్ధగోపకులు అంతా కలసి ఉత్సవ ఏర్పాట్లకు మంతనాలు చేస్తున్నారు. వారిలో మన చిన్న కృష్ణయ్య, బలరాముడు కూడా ఉన్నారు. వారి మాటలకు మధ్యలో అడ్డు వస్తూ చిన్న కృష్ణయ్య "అయ్యా! తమరేదో చర్చిస్తున్నారు. నేను కూడా అది వినవచ్చా?" అని ముద్దుగా అడిగాడు. దానికి వారు తప్పక వినవచ్చు అని చెప్పారు.

కృష్ణుడు తన మనస్సులో 'వీరంతా ఇంద్రుని మాయలో పడి భయపడి ఇంద్రుని దైవంగా భావిస్తున్నారు. ఈ వ్రజవాసులకు సత్యాన్ని తెలియజేసి ఇంద్రునికి గుణపాఠం నేర్పాలి' అనుకున్నాడు. నంద మహారాజుతో "నాన్నగారూ! మీరు ఏ విషయమై యింత దీర్ఘంగా చర్చిస్తున్నారు?" అని అడిగాడు. దానికి సమాధనంగా నందుడు "నాయనా! మనం ప్రతి యేటా యాగం చేస్తాము. దాన్ని వసంత వేడుకలు అంటారు" అన్నాడు. "ఆ యాగం చేస్తే మనకి వచ్చే లాభమేమిటి?" అడిగాడు కన్నయ్య. దానికి సమాధనంగా "ఆ యాగ హవిస్సులు ఇంద్రాది దేవతలు తీసుకుంటారు. ఇంద్రుడు వర్షాలు కురిపిస్తాడు. మనకు పాడిపంటలు, పశుగ్రాసం ఉంటాయి దానివల్ల" అని చెప్పారు.

శ్రీకృష్ణుడు మనస్సులో 'ఈ యాగాన్ని ఎలాగైనా అపేసి, తన అవతార ప్రయోజనాన్ని, దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ జరిపించాలని' అనుకుని, వారితో "నేను మీకు ఒక సలహా చెబుతాను వింటారా?" అని ముద్దుముద్దుగా అడిగాడు. చెప్పమన్నారు వాళ్ళు. "మీరు యీ యజ్ఞం ఆపివేయండి" అన్నాడు. "అమ్మో! ఈ యజ్ఞం చేయకపోతే ఇంద్రుడికి కోపం వస్తుంది. వర్షాలు కురిపించడు. అప్పుడు పాడి పంటలు నష్టమొస్తుంది" అన్నారు వాళ్ళు భయంగా.

కృష్ణపరమాత్మ వాళ్ళతో "మీకేమీ భయం లేదు. నేను ఉన్నాను. నా మాటను విశ్వసించండి. మీకు అంతా మేలే జరుగుతుంది. ఎవరి వల్ల సృష్టి స్థితి లయాలు జరుగుతున్నాయో, వీటికి ఆధారుడెవడో అన్నీ తెలియజేస్తాను" అన్నాడు.

వారంతా మనస్సులో చిన్నపిల్లవాడైనా గతంలో చేసిన ఘనకార్యాలను తలచుకుని, మూడు నెలల వయస్సులోనే పూతనను చంపాడు. తరువాత శకటాసురుడు, తృణావర్తుడు యిలా ఎందరెందరో రాక్షస సంహారం చేశాడు. ఇతని సామాన్యబాలుడని ఎంచతగదు. అని నిశ్చయించుకుని, "కృష్ణా! నీవేమి చెబితే అదే చేస్తాము' అని చెప్పారు.

"ఈ యాగంకోసం సమకూర్చిన పూజా సామాగ్రి, పిండివంటలు అన్నీ తీసుకుని వచ్చి, ఈ గోవర్ధన గిరికి పూజచేసి, నివేదనలు చేయండి" అన్నాడు. గోపికలంతా కలసి ఆ గోవర్ధన గిరికి చుట్టూ పసుపు కుంకుమ లతో రంగవల్లులు దిద్ది, గోపాలురంతా పూజలు చేసి, నైవేద్యాలు చేశారు. పరమాత్మ చేతులు చాచి ఆ పదార్థాలన్నీ స్వయంగా స్వీకరించాడు. గోపాలురంతా సంభ్రమాశ్చర్యాలతో చూస్తున్నారు. మిగిలినవన్నీ అక్కడి జీవరాసులకు పెట్టించాడు కన్నయ్య. సర్వ ప్రాణులు సంతుష్టి చెందాయి.

ఆ వ్రజవాసులంతా ఆనందోత్సవాలతో, కన్నయ్యతో కలిసి, చెప్పినట్లు చేస్తూ ఎనలేని ఆనందాన్ని పొందారు. వారి మనస్సులో "ఎప్పుడూ జరిగే యజ్ఞంలో హవిస్సులు ఆ దేవతలకు అందుతాయో, లేదో మనకు తెలవదు. కాని ఈనాడు సకల జీవరాసుల రూపంలో ఆత్మగా వెలిసిన మన కన్నయ్య ఆరగిస్తే కలిగిన ఆనందం అవధులు లేనిది. జీవితంలో మరపురానిది" అని భావించారు.

ఇదంతా గమనించిన ఇంద్రుడు ఆగ్రహించి పంచభూతాలను శాసిస్తూ "చిన్నివాని మాట విని ఆ వ్రజవాసులు మనకు హవిస్సు నీయకుండా ఆ కొండకి పూజచేస్తారా? ఏమా గర్వం! మీరంతా వెళ్ళి ఆ వ్రజపురమంతా రాళ్ళవానతో భీభిత్సం చేసిరండి" అని ఆజ్ఞాపించాడు.

ఆ ప్రళయానికి తట్టుకోలేక ఆ వ్రజవాసులు గడగడలాడిపోతూ ''కృష్ణా! కృష్ణా!'' అంటూ ఆర్తనాదాలు చేశారు. బాలకృష్ణుడు చిరునవ్వుతో వారందరికీ అభయమిస్తూ తన చిటికెనవేలుతో ఆ కొండపైకి ఎత్తి పట్టుకుని, "మీరందరూ విశ్వాసంతో దీనికి క్రిందకు రండి, మీకే భయము లేదు'' అని పిలవగానే వారంతా దాన్ని



ఆశ్రయించి రక్షణ పొందారు. వారంతా ఆ బాలుని పరమాత్మగా గుర్తించి, ఆశ్రయించి, కీర్తించారు. వెంటనే ఇంద్రుడు కూడా తన తప్పిదనాన్ని తెలుసుకుని, నారాయణ మూర్తిని గుర్తించి, క్షమించమని వేడుకున్నాడు. కృష్ణపరమాత్మ కరుణతో ఇంద్రుని గర్వభంగంచేసి, అతనికి అభయమిచ్చాడు!

*

# ఋషభ చరితమ్

– సుశీలా ప్రసాద

(శ్రీమదాంధ్ర భాగవతము నుండి)

జంబూద్వీపాధిపతియైన ఆగ్నేధ్రుడు అను మహారాజు సంతానార్థియై మందరాద్రి సమీపమున ఏకాగ్రచిత్తుడై సకలోపచారములతో బ్రహ్మదేవుని అర్చించగా పరమేష్ఠి సంతుష్టుడై తన కొలువులో గాయిని అయిన పూర్వచిత్తి అనే అప్సరసను ఆ రాజు వద్దకు పంపించాడు. పద్మాసనుడు తనకు ప్రత్యక్షమై వరంగా యిచ్చిన ఆమెను పరిగ్రహించి ఆగ్నేధుడు ఆమె వలన ఏడాదికి ఒకరుగా తొమ్మిదిమంది పుత్రులను కన్నాడు.

వారి పేర్లు..... నాభి, కింపురుష, హరివర్ష, ఇలావృత, రమ్యక, హిరణ్య, కురు, భద్రాస్వ, కౌతుమాల అను పేర్లు గల వారు తల్లి తమను విడిచి బ్రహ్మలోకానికి వెళ్ళి పోయిన తరువాత శరీర బలాయుక్తులై జంబూద్వీపాది వర్షములను తండ్రి అనుజ్ఞతో పాలిస్తున్నారు.

తండ్రి పరలోక గతుడైన తరువాత నాభి ప్రముఖులగు ఆగ్నేధ కుమారులగు తొమ్మిదిమందిని మేరుదేవి, ఫుతిరూప, ఉగ్రదృష్ట, లతా, రమ్య, శ్యామ, నారి, భద్ర, దేవవతి అనుపేర్లుగల మేరు పుత్రికలయిన తొమ్మిదిమంది కన్యలను వివాహం చేసుకున్నారు.

నాభి, మేరుదేవితో యజ్ఞపురుషుడైన వాసుదేవుని భక్తిశ్రద్ధలతో కర్మయోగ, యాగవిధాన పరమేశ్వరుని మెప్పించగా ఎవరికీ ప్రసన్నంకాని పుండరీకాక్షుడు భక్తవత్సలుడై నాభి హృదయంలో విరాజిల్లుతున్న నయనా నందకరమైన రూపంతో చతుర్భుజుడు, పీతాంబరధారి శ్రీవత్సకౌస్తుభ శ్రీం రమా చిహ్నాలతో శంఖు, చక్ర గదాది దివ్య ఆయుధాలతో సకల భూషితుడై ఆ దంపతులకు ప్రత్యక్షమైనాడు.

ఈ విధంగా సాక్షాత్కరించేసరికి ఆ దంపతులు పెన్నిధిని గన్న పేదవలె ఋత్విక్కులతో కలసి భగవంతుని అనేక విధాల స్తుతి చేశారు. "రాజర్షి అయిన యీ నాభి మోక్షనాధుడవైన నీ వలన సంతానం కోరుతున్నాడు. ఈయన్ని దయ చూడ"మని ఋత్విక్కులు

ప్రణమిల్లగా దేవతా శ్రేష్ఠుడైన సర్వేశ్వరుడు అయిన పరమేశ్వరుడు "మునులారా! నాతో సమానమైన కొడుకును యిమ్మన్నారు. లోకంలో నాతో సమానమైనవారు వేరొకరు లేరు. కావున మేరుదేవికి నేనే కొడుకుగా జన్మిస్తాను" అని చెప్పి హోమగుండంలో అంతర్ధానమై మహాతేజస్సు రూపంలో మేరుదేవి గర్భాన ప్రవేశించాడు.

మేరుధీరుడు, శమదమాది విశారదుడు అయిన శ్రీవిష్ణువుకు కుమారుడై జన్మించగా వాని ధవళకాంతి యుక్తమైన శరీరము బలపరాక్రమములు వీర్యము చూసి, తండ్రి కొడుకుకు ఋషభుడు అని పేరు పెట్టాడు. రాజులు, మంత్రులు, ప్రజలు, పరివారము, బంధువులు అందరూ కూడా ఆ బాలుణ్ణి ఎంతో ప్రేమగా చూస్తూ వచ్చారు.

ఇంద్రుడు అతని మహిమలు విని అసూయ చెంది, ఋషభుని రాజ్యమైన 'అజనాభం'లో అనావృష్టి కలుగుజేశాడు. అది చూసి ఋషభుడు తన యోగమాయ బలంతో రాజ్యమంతా సంపూర్ణ వృష్టిని కలుగుజేశాడు. రాజ్యాన్ని అభివృద్ధి చేశాడు. కొడుకు యిలా యింద్రుని అల్లరికి నవ్వి, మండలం సుభిక్షం చేయగా చూసి తండ్రి తన కోరిక మేరకు కుమారుడు పుట్టి వృద్ధి పొందటాన్ని చూసి, ఆనందించి దేశానికి అతన్ని రాజుగా చేసి, పరివారాన్ని, రాజ్యాన్ని అతనికి అప్పగించి, నాభి మేరుదేవితో నరనారయణ స్థానమైన బదరికాశ్రమానికి వెళ్ళి అక్కడ మహాయోగ సమాధి పొంది వాసుదేవునిలో లీనమయ్యాడు.

రాజు యాగంలో బ్రాహ్మణులు విష్ణువును ప్రసన్నం చేయగా మెచ్చి విష్ణుమూర్తి తనంతట తానుగా వచ్చి గర్భంలో ప్రవేశించి కుమారుడై పుట్టిన నాభికి సరియైన వారెవరూ లేరు.

ఋషభుడు ప్రతమన్యు కుమార్తె జయింతిని పెళ్ళాడి భరతుడు ఆదిగా నూరుగురు కుమారులను కన్నాడు. వారిలో ఒకడైన భరతుని పేరుతో మన దేశానికి 'భారతదేశం' అనే పేరు వచ్చింది. అతడే జడభరతుడు! లేడిమీద మోహంతో జన్మనెత్తిన జడభరతుడు మహాజ్ఞాని!!

*

# పరి ప్రశ్నేన సేవయా

- పరాశర ప్రసాద్

'ఆ మార్గమును గుణించలేము క్రోసులలో, హర నామమే ఆ దారిలో బత్తెము' అనే గీతమును శ్రీసద్గురుదేవులు తరచుగా వ్యాహ్యాళిలో పాడించేవారు. జన్మకు వచ్చిన ప్రతివారు ఆ మార్గములో పయనించ వలసినదే తప్పదు. ఆ ప్రయాణము యింత దూరమని ఎవరైనా లెక్కగట్టగలిగేవారున్నారా? అసలు ఆ ప్రయాణం ఎలాంటిది? మానవుడు స్థూల శరీరాన్ని విడిచిపెట్టి, సూక్ష్మ శరీరము వాసనలతోకూడి సాగించే ప్రయాణము అది. అది చాల దుర్భరమైనది. సూక్ష్మ శరీరానికి రక్షణ లేదు. దానికి మరణం లేదు. అది శీతోష్ణాది బాధలకు గురవుతూ ప్రయాణం చేయాలి. దాని గమ్యం ఏమిటి? ఆ శరీరాన్ని ఆవరించిన కర్మననుసరించి, ఒక పంజరాన్ని వెతుక్కుని తిరిగి జన్మకి రావటమే గమ్యం. అంతవరకు అది అలా సంచరించ వలసినదే. పోనీ కోరిన పంజరం దొరుకుతుందా? గ్యారెంటీ ఉందా? ఆ హామీ యివ్వగల వారెవరు? ఆ పంజరం గజ్జికుక్క కావచ్చు, కుంటి నక్కకావచ్చు, కొండ చిలువ కావచ్చు, లేక నల్లి కావచ్చు! ఎవరు చెప్పగలరు?



మానవుడు యీ రకమైన దుర్భర స్థితిని అనుభవించటానికి కారకులెవరు? ఇంకెవరు? తన జీవితకాలం చేసిన దుష్కృత కర్మలే వాసనగా మిగిలి కారణ శరీరమై జన్మకి తీసుకువస్తుంది. మరి దీనికి నిష్కృతి లేదా? దీనిని అధిగమించే మార్గం లేదా? తప్పకఉంది. అందుకనే సద్గురుదేవులు ఆ గీతములో "హరనామమే ఆ దారిలో బత్తెము అని చమత్కరించారు. భగవానుని విశ్వసించి, సేవించి, భజించినవానికి ఈ ప్రయాసలు ఉండవు. సద్గురుమూర్తిని ఆశ్రయించి లక్ష్యార్థ సాధన చేసిన గురుబిడ్డకి పునరావృత్తి ఉండదు. కనీసం సద్గురుమూర్తిని ఆశ్రయించి, పుణ్యకర్మలు చేసినవారు ఉత్తమ గతులను పొంది, మరు జన్మలో సద్గురుమూర్తి అనుగ్రహానికి పాత్రులై తప్పక జన్మ రాహిత్యం పొందుతారు. ఇది మాత్రం సత్యం" అన్నారు శ్రీబాబూజీ మహరాజ్.

పూర్వజన్మ సంస్కారం వలన వచ్చిన మానవజన్మను వృథా చేసుకోకుండా, సద్గురుమూర్తి చేసిన బోధని మననం చేసుకుని, విచారణ ద్వారా కర్మని రహితం చేసుకుంటే అంతకంటె కావలసిన దేముంది? పరిపూర్ణ విశ్వాసం ఉన్నవాడే ధీరుడు. వాడే మరణాన్ని జయించినవాడు. వాడే జీవన్ముక్తుడు. వాడే నిజమైన గురుబిడ్డ!!

# వేస్తుంటే ఒక్కొక్క దండా మీ మెడనిండా

-పెనుమాక నాగేశ్వర రావు

వేస్తుంటే ఒక్కొక్క దండా మీ మెడ నిండా
ఎన్నెన్నో తీయని గురుతులు మా మది నిండా
బాబూ......వేస్తుంటే ఒక్కొక్క దండా.......
మీ కరముల రెంటా వరముల పంటా .....
కనుదోయి వెంటా ఆశీశ్శులంటా ......... ॥వేస్తుంటే॥

చూస్తుంటే మీ కన్నులలోకి ఏకంగా ....... తదేకంగా
ఎన్నెన్నో సంజ్ఞలు మా హృది పులకింపా
మీ వదనము నిండా వెన్నెల పంటా........ వదనము నిండా.....
పెదవుల వెంటా చిరునవ్వులంటా ............. ॥వేస్తుంటే॥

కూర్చుంటే మీ సన్నిధిలో మౌనంగా
మారునులే అదియే మా ధ్యానంగా
ధన్యములే మా జన్మలు మీ మూలంగా
భావింతుములే అదియే మా భాగ్యంగా...... ॥వేస్తుంటే॥



(గతసంచిక తరువాయి) **భగవద్గీత – వర్తమాన సమాజం** - రేఖ

(మద్రాసు విశ్వవిద్యాలయం వారి తెలుగుశాఖ, మరియు శ్రీకాళహస్తి శ్రీశుక బ్రహ్మాశ్రమమువారు సంయుక్తంగా 22-12-13న నిర్వహించిన సదస్సులో శ్రీమాతాజీవారి బోధామృతము)

గీతా మకరందం అందరిదీ అయింది. అది ఏ ఒక చరిత్రకో, లేదా ఒకానొక వ్యక్తి కథకో చెందినది కాదు. అది తత్వానికి చెందినది. అందరిలో ఉన్న ఆ చైతన్య శక్తికి చెందినది. జీవాత్మ పరమాత్మలకు చెందినది. గురుశిష్య న్యాయానికి సంబంధించినది. అది మహాభారతం లోనిదే. ఎలాగైతే చెరకుగడలోని పిప్పిని పారవేసి, తియ్యటి రసాన్ని తీసుకుంటామో, భారతంలో సారమైన గీతామకరందాన్ని గ్రోలాలి.

శ్రుతుల సారం ఉపనిషత్తులైతే, ఉపనిషత్ సారమే గీత. దాని నుండి మనకు భగవన్నామం యొక్క మాహాత్మ్యం తెలుస్తుంది. నామానికి, ఆ నామానికి అధిష్ఠానమైన రూపానికి తేడా లేదు. గీతలో శ్రీకృష్ణుడు బోధ చేసిన ఆ పదములను సద్వినియోగం చేసుకోవాలి. ఇంద్రియాలు కలిగినందుకు సద్భావన కలుగజేసే భావన చేయాలి. ఆయన పదములను వినాలి, అనాలి, ఆచరించాలి.

శ్రీగురుదేవులు అంటూ ఉండేవారు "భగవంతునికి రెండు పాదములు మనకోసమే ఉన్నాయి. ఒక చేతితో పాదాన్ని పట్టుకుని, రెండవ చేతితో స్వధర్మాన్ని ఆచరిస్తూ, వీలు దొరికనప్పుడల్లా ఆ రెండో చేతిని కూడా భగవంతుని రెండో పాదంపై ఉంచాలి" అని అనేవారు. ఈ శరీరంతో కర్మలు ఎన్ని చేస్తున్నా, మనసు మటుకు భగవంతుని చరణారవిందాల యందే ఉండాలి.

మనసు కలిగినవాడు, ఆ మనసుని ప్రకాశింపజేసేవాడు భగవంతుడు. మనసు సంకల్పిస్తుంది. ఆ సంకల్పం నెరవేరాలా వద్దా అనేది బుద్ధి నిర్ణయిస్తుంది. మహాత్ములు మనస్సును ఏవిధంగా ప్రబోధించుకోవాలో మనకు నేర్పారు. (శ్రీమాతాజీ 'మనసా! ఎటులోర్తునే' అనే త్యాగరాజ కీర్తన పాడుతూ యీ విధంగా బోధ చేశారు........)

"మనసు ఏ చింతనలో, ఏ సంగంలో ఉంటే అలా తయారు అవుతుంది. మనసుని దినకర కులభూషణుడు అంటే సూర్యవంశ

జాతకుడు, కులభూషణుడు అయిన శ్రీరాముని భజనలో లీనమవ మంటే వినటం లేదు. విషయాదుల వెంటే పరుగెడుతోంది. భజన అంటే సేవ అని కూడా అర్థం ఉంది. భగవంతుడిసేవ, భక్తుల సేవయే కాక, భగవచ్చింతన చేస్తూ స్వధర్మాన్ని ఆచరించటం కూడా సేవక్రిందే పరిగణింప బడుతుంది. రజో, తమో గుణ సంపన్నుల సాంగత్యంతో కాలం వృథా చేసుకోవటం కంటే మహాత్ములు బోధించినటువంటి, చూపించి నటువంటి మార్గం అనుసరించి వెళితే బ్రతికి ఉండగానే ముక్త స్థితిని పొందుతాము.

అలా సత్యాన్ని అనుభవిస్తూ, ఎవరి ధర్మాన్ని వారు ఆచరించాలని భగవంతుడు అందుకు కావలసిన భక్తిని, శక్తిని అందరికీ ప్రసాదించాలని తమ ఆశీశ్శులను అందజేస్తూ శ్రీమాతాజీ తమ ఆధ్యాత్మిక సందేశాన్ని ముగించారు.

అయస్కాంత సాన్నిధ్య మాత్రంతో సూదులు కదులుతాయి.కాని కర్తృత్వం అయస్కాంతానికి లేదు.

సూర్యుడు ఉదయిస్తే చాలు పద్మాలు వికసిస్తాయి, కలువలు ముకుళిస్తాయి. కొందరు కృషి వాణిజ్యాలకు, కొందరు ఉద్యోగాలకు, కొందరు ఆహ్నికాదులకు వెళతారు.

సూర్యుడు ఎవరితోటీ ఏ పనీ చేయించడు. ఆయన కర్తకాదు. కేవలం అధ్యక్షుడు మాత్రం.

భగవంతుడు 'మయాధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరం' అనటంలో అర్థమిదే.

డా॥ వి.వి.ఆర్ ప్రసాద్‌రావు

# శ్రీకృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

ఈ మధ్య దీపకి ఒక యాల ఊదుతున్నట్లు తరచుగా శబ్దం మెల్లగా వినిపిస్తోంది. ఒంటరిగా ఆరుబయట వెన్నెల్లో పడుకుంటే ఆశబ్దం మరింత ఎక్కువగా వినబడి, నిద్రపట్టబోతున్న దీపకు మెలకువ వచ్చేస్తోంది. అందులో హాయి తెలియని ఆనందం కలుగుతుంటే దీపకి ఇహ నిద్ర పట్టటం లేదు. ఇది కలకాదు నిజమే అని అది వింటూ నిశ్చయించుకుంటోంది దీప. ఆ తరువాత చిత్రంగా ఆమెకి ఎవరో చెవిలో గుసగుసగా 'ఈ పిల్లనగ్రోవి వింటున్నావా?' అనే మాటలు తియ్యగా వినబడసాగాయి. ఎవరిదో ప్రేమపూరితమైన స్వరం. వారెవరో తనకి అసలు తెలియదే! ఎవరితో చెప్పినా వారికి అర్థం కాదు. అందుకే దీప ఎవరితోటీ అనలేదు.



ఇది యిలా ఉండగా దీప పెద్దమ్మ కోడళ్ళు కొడుకులతో అలిగి తన కూతురు యింటికి వెళ్ళి పోయింది. కోపంగా వెళ్ళిన ఆవిడ దీపని దాని ఖర్మాన దాన్ని వదిలివేసి వెళ్ళిపోయింది. అన్నలు, వదినలు దీపని సణుక్కోవణం దీపకి వినిపిస్తోంది. అక్కడ ఉండటం యిహ దీపకి కష్టంగా తోచింది. అందుకని ఒకనాడు ఒదినలతో చెప్పింది "నేను రేపల్లె వెళ్ళిపోతాను. అక్కడ యిల్లు ఉంది. అమ్మ ఉన్నప్పుడు రెండు గోవులు ఉండేవి. అవి ఎవరిదగ్గర ఉన్నాయో కనుక్కొని నా బ్రతుకు నేను బ్రతుకుతాను" అన్నది.

'దీపకు కాస్త వయస్సు వచ్చింది కాబట్టి దాని బ్రతుకు అది బతుతుకుతుందిలే, మన నెత్తిన పాలు పోసింది' అని అనుకున్న అన్న ఒదినలు 'సరే' అన్నారు.

రేపల్లె తిరిగి వచ్చింది దీప. ఇంట్లో అడుగుపెట్టగానే తల్లి జ్ఞాపకాలు మెదిలి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అంతలోనే తన తల్లితో కలసి యశోదమ్మ యింటికి వెళ్ళినప్పుడు కన్నయ్య రూపం ఆ లీల గుర్తుకు వచ్చి పెదిమలపై చిరునవ్వు చిందులాడింది. ఇరుగుపొరుగువారు వచ్చి దీప యోగక్షేమాలు కనుక్కుని ఆమెకు అండగా నిలబడతామన్నారు. వారి దగ్గర ఉన్న రెండు గోవులను దీపకు అప్పగించారు. వాటిని మేపుకు రావటం, ఆ పాలుపెరుగు పట్నంలో అమ్ముకురావటం దీపకు దినచర్య అయింది. వచ్చిన నాలుగురోజులకు యశోదమ్మ దీపకు కబురు పంపింది. 'ఎంత ఎదిగావే!' అంటూ దీపను చూసి విస్తుపోయింది. 'నీకేమైనా కావాలంటే బిడియపడక

నన్ను అడుగమ్మా' అని ఎంతో ఆప్యాయతగా చెప్పింది. ఆమె మాట్లాడుతుంటే ఆ ముగ్ధబాలుని కోసం చుట్టూరా చూసింది దీప. కాని వాడి జాడ లేదు.

నీళ్ళకి యమునా నదికి వెడుతున్నప్పుడు, చల్ల అమ్మటానికి పట్నం వెడుతున్నప్పుడు ఆ మురళీ రవం సన్నగా వినబడుతూనే ఉంది దీపకి. గోవులను మేపటానికి బృందావనానికి వెళితే ఆ శబ్దం మరింతగా విజృంభించి వినిపిస్తోంది. ఆ పిల్లన గ్రోవి పాటగాడు ఎవరు? దీప మనసులో తను చూసిఎరుగని ఆ ఊహారూపం క్షణక్షణం ఆమెలో ఆవేదన కలిగిస్తోంది. చూడాలనే తపన దీపని విడువకుండా ఉంటుంది.

ఒకనాడు గోవులతో బృందావనానికి వెళ్ళింది. గోవులు సుఖంగా మేత వేస్తుంటే దీప చెట్లకి ఉన్న రంగురంగుల పూలు కోసి, ఒడిని నింపుకుంటున్న ఆ వేళ పిల్లన గ్రోవి పాట మనస్సు తనువుని మైమరిపిస్తూ వినబడసాగింది. పచ్చికమేస్తున్న గోవులు గడ్డిపరకలు రెండు నోట్లో వ్రేలాడుతుండగా ఆ శబ్దం వినవచ్చిన వైపుగా పరుగిడసాగాయి. దీపకి ఆశ్చర్యం వేసింది. దీప వాటి వెనుకే నడవసాగింది. ఎక్కడకి అలా దూసుకు పోతున్నాయో అనుకుంటుంటే అల్లంత దూరాన ఆగాయి. ఆవైపుకి వెళ్ళింది.

విశాలమైన కొమ్మలు విస్తరించి ఉన్న కదంబవృక్ష ఛాయలో మనోహరమైన ఆకారం కలిగిన బాలుడు అక్కడ కూర్చుని ఉన్నాడు. ఎర్రని పెదవులపై మురళి నిలిచి ఉంది. అక్కడి నుండి బయలుదేరిన ఆ తియ్యని గానం విశ్వం అంతా వ్యాపిస్తోంది. ఇన్నాళ్ళ నుండి తనకి వినిపిస్తున్నది అదే పాట. చుట్టూ గోవులు, గోపాలకులు, పాములు, నెమళ్ళు, కాకుళ్ళు అన్నీ గుమిగూడి ఆ గానాన్ని మైమరచి వింటున్నాయి. దీప పరవశంతో ముందుకు నడిచింది. ఆ మోహనాకారుణ్ణి పట్టుపట్టి చూసింది. ఆ కళ్ళలో నీలిరంగు, ఒంటిపై మెరిసే కాంతులు దీప కళ్ళని వెలిగించాయి. అలనాటి బాలుడే యీ కన్నయ్య అని గుర్తుపట్టింది దీప. ఇతడేనా నన్ను అలరించి రాగాలు పాడుతున్న గాయకుడు. కన్నయ్య ఆమె వంక చూశాడు.మురళీ పక్కన పెట్టి అందంగా నవ్వాడు. "చూడూ! ఆనాడే నీ మనోమందిర ద్వారం తెరచి లోనికి ప్రవేశించి కదలకుండా తిష్ఠ వేసుకుని కూర్చున్నాను. అక్కడే ఇంతదాగా ఎదిగాను. నేను లోపలికి ప్రవేశించాక ఆ తలుపులు మూయబడవు. నీ యింటిని వదలను. ఇలాగ నీ హృదయ మందిరంలో నివసించి ఉంటున్నందుకు నీకు నేను చెల్లించే అద్దె 'బ్రహ్మానందం".

ఒడిలోని పూలు కన్నయ్య దివ్య పాదాల మీద ఉంచిన దీప ఆ రసరాజ్య చక్రవర్తికి సాగిలపడి నమస్కరించింది.

# ఏకత్వ దృష్టి

- కె.వి.

హిందూమతం, హిందూ ధర్మం సారాంశం ఏమిటి? సర్వేజనాః సుఖినో భవంతు, సర్వేషాం స్వస్తిర్భవతు, సర్వేషాం శాంతిర్భవతు అంటే అర్థం ప్రజలెల్లరూ సుఖశాంతులతో జీవించెదరు గాక, ప్రజలంతా శాంతి, సంక్షేమాలు బడయుదురు గాక అని మన ఆకాంక్ష హిందూ మతంలోని యీ సమున్నత ఆశయాలకు మనం గర్వపడతాం. కాని కేవలం యిటువంటి ఆశయాల వల్ల ప్రయోజనం ఉందా?

ఒక వినిర్మల హృదయం నుండి వెలువడే ఆశీస్సులు నిస్సందేహంగా శక్తివంతమైనవే. కాని హృదయ నైర్మల్యంతోపాటు సత్కార్యాలు కూడా చేయాలి. ఇతరులు సుఖశాంతులతో జీవించాలని కాంక్షించటంతోపాటు వారికి మేలుకూడా చేయ గలగాలి. ఒకరిని గూర్చి చెడుగా ఆలోచించి, వారికి మన చర్యలలో కీడు తలపెట్టటం నిజాయితీ అనిపించుకోదు. అది ధర్మమని ఉచ్ఛరిస్తూ చర్యలో అధర్మంగా ప్రవర్తించటంతో సమానం. జీవితంలో సత్కర్మకు హిందూధర్మం అత్యంత ప్రాధాన్యత యిస్తుంది. సత్కర్మ సద్యోచన సత్సంకల్పం నుండి ఉద్భవిస్తాయి.



మన స్వస్వరూప సాక్షాత్కారము నుండి యీ సత్సంకల్పం ఆవిర్భవిస్తుంది. ఈ స్వస్వరూపం పరమాత్మ తప్ప మరొకటి కాదు. ఈ పరమాత్మ సర్వమానవాళికి మూలం. అందరినీ పోషించే శక్తి.

ఆత్మ సాక్షాత్కారమే మహోత్కృష్టమైన లక్ష్యంగా హిందూ ధర్మం నిర్దేశించింది. ఇందుకు కర్మయోగం, భక్తియోగం అనే రెండు మార్గాలను హిందూ ధర్మం ప్రబోధించింది.

ఈ ఆత్మసాక్షాత్కారానికి మనోహృదయాలను ప్రక్షాళన చేసుకోవటం అతి ముఖ్యం. మనస్సుకు మరోపేరు అంతఃకరణ. దీనిలో నాలుగు భాగాలున్నాయి. అవి మనస్సు, బుద్ధి, చిత్త, అహంకారాలు. వాటిని పరిశుద్ధం చేయటానికి అత్యుత్తమ మార్గం పరమాత్మ నామగానమే. ఆయనను ప్రేమించటం, ఆయనపై ఆధారపడి జీవించటం వలన ఆయన కృప కార్యరూపం దాలుస్తుంది. దీని ఫలితంగా అంతఃకరణ లోని నాలుగు భాగాలు దివ్య పరిణామం చెందుతాయి. సంకల్ప

వికల్పాలకు గురి అయ్యే మనస్సు సత్యంగా నిర్ణయాలు తీసుకునే బుద్ధి దయగా, పరిపరి విధాల మనస్సును పరుగులెత్తించే వాసనలకు స్థానమైన చిత్తము శాంతిగా స్థిర పడుతుంది. అహంకారం ప్రేమగా రూపాంతరం చెందుతుంది.

ఈ నాలుగు దివ్య గుణాలు అంటే సత్యము, శాంతి, దయ, ప్రేమ మన అంతస్చేతనను ఆక్రమించినప్పుడు ఎటువంటి దుష్ట ప్రవృత్తులకు గీతాచార్యుడు చెప్పిన అసుర సంపత్తికి మనస్సు ఆలవాలం అయ్యే అవకాశం ఎక్కడ ఉంటుంది? మనస్సు పూర్తిగా పరిశుద్ధ మవుతుంది. నిర్మలమైన మనస్తత్వం నిర్మలమైన కర్మలకే దారి తీస్తుంది.

ఈ కార్యకలాపం సర్వసమానత్వంపై ఆధారపడి ఉంటుంది. కుల మత భాష జాతి విభేదాలు దానికి లేవు. దాని ముందు అందరూ సమానులే. ఎందుకంటే అందరిలోనూ భాసించే దైవాన్నే అది వీక్షిస్తుంది. ఈ పరివర్తనే హిందూమత లక్ష్యం. భగవంతుని యెడల అపరిమిత ప్రేమ, భక్తి చూసి ఆయన కృపతో దానిని సాధించటం అతి తేలికైన మార్గం. ఈ విశ్వజనీన మతాన్ని ప్రబోధించటం వలనే ఒక మహనీయ జీవన విధానంగా హిందూమతాన్ని పరిగణించటం జరిగింది. ఈ జీవన విధానం మానవాళి అందరినీ మహోన్నత గమ్యానికి నడిపిస్తుంది.

అహంకార మమకార బంధాలలో 'నేను', 'నాది' అనే భ్రాంతిలో మనుష్యులు చిక్కుకుంటారు. ఆత్మ సాక్షాత్కారంతో ఆ భ్రమలన్నీ తొలగి పోతాయి. ఆత్మ సాక్షాత్కారమంటే మానవులందరిలోను భాసిస్తున్న పరమాత్మ సాక్షాత్కారమే."

గుంటూరులో హిందూకళాశాల ఆవరణలో విశ్వహిందూ పరిషత్ ఏర్పాటు చేసిన సభలో శ్రీబాబూజీ మహరాజ్ ఉద్బోధిస్తూ పై విధంగా ప్రబోధించారు. ఆయన యింకా మాట్లాడుతూ "హిందూ మతం అనాది. తన ధర్మాలను చిరకాలంగా ప్రబోధిస్తూ వస్తోంది. ఏకత్వ దృష్టిని ప్రసాదించి భిన్నత్వాన్ని రూపుమాపే మతం అది. మానవులు ఒకరినొకరు ప్రేమించుకోవటం తెలుసుకోవాలి. వైషమ్యాలకు తావుండరాదు. అన్ని యుగాలలోనూ యీ మతంలో మహాపురుషులు అవతరించారు. వారు ఆదర్శపురుషులుగా జీవిస్తూ మతంలోని సత్యాలను సాక్షాత్కరింప జేసుకుని మానవాళికి ప్రబోధించారు.

-సశేషం

# వ్యోమ వద్వ్యప్త దేహాయ

- రమణ ప్రసాద్

ధ్యానం చేసేటప్పుడు అవయవాలన్ని కళ్ళు చేసుకోవాలి. అంటే ఫ్రీగా ఉంచాలి. నిరంతరం చేస్తే కాళ్ళు బిగుసుకోవు. కనురెప్ప వేయటం, శ్వాస పీల్చటం మనం గమనించము. ఎప్పటికప్పుడు నిజ జాగ్రత స్థితిలో ఉండాలి. ఈర్ష్య, అసూయ, ఓర్వలేనితనం లేకుండా చూసుకోవాలి.ం తలపులను అదుపులో పెట్టాలి. నీ మనస్సు పరుగెడుతుంటే వివేకంతో ఆ వచ్చే తలపులను ఖండించు. ఇది అవసరమా? ఇది పారమార్థికమా? అని వివేచన చేసుకో. గురుదేవుల పాదపద్మాలపై దృష్టి నిలుపు. మొదట సగుణారాధన, తరువాత నిర్గుణారాధనకు వెళతావు.

గోపికలు, శబరి ఏ శాస్త్రాలు చదివారు? గోపికలు తమ అనన్య భక్తితో కృష్ణుని దర్శించారు. శబరి గురువాక్య పాలన చేసి తరించింది. ఆమెకు చిన్నప్పుడు మాతంగ మహర్షి చెబుతారు 'నీకు తప్పక రామ దర్శనం అవుతుంది' అని. అంతే! ఆ రోజునుంచి ఆమె రామదర్శనం కోసం ఎదురు చూసింది. రాముడు వచ్చి దర్శనమిచ్చాడు.

కాలం గడచిపోతోంది. కాలుడు నీ వెనకే ఉన్నాడు. సద్గురువుని ఆశ్రయించు. ధ్యాన మార్గంలో పయనించు. ధ్యానం అంటే బుద్ధి యొక్క ఏకాగ్రత. సరియైన మార్గాన్ని ఎంచుకోవాలి. మన్ కవాట్ ఖోలో మలిన విషయ్ ధోలో - ఈ కీర్తన మనకు గురుగీత. 'ఏదేశమందు, ఏకాల మందు' యిది కూడా వారే చెప్పారు. అంతఃశుచి కావాలి. భగవన్నామమనే మడి కట్టుకోవాలి. సత్యాన్ని గుర్తించాలి.

మహాత్ములు శరీరాన్ని లెక్కచేయరు. రమణమహర్షికి పుండు వచ్చింది. దీన్ని తీసేసుకోవచ్చుగదా? అని శిష్యులు అంటే దానికి వారు "మీరంతా ఎలా వచ్చారో, ఇదీ అలానే వచ్చింది" అన్నారు.

నిర్గుణము, నిరాకారము అయిన పరమాత్మ సగుణభూషణుగా మన ముందుకు వచ్చారు. వారి రూపము, నామము, గుణము ఎంత మహిమా! నిత్యములండీ! వారు అందించే బోధలో మనోలయం చేస్తే ముక్తి లభిస్తుంది.

ఆ ప్రభువు ప్రళయాంతంలో ఆనంద సాగర మందు పవ్వళించాడట. అది సాగరమా? భక్త హృదయమా? ఎవరికి తెలియ

తరమౌ? ప్రహ్లాదుని హృదయం **deepest ! deepest !** శబరి మాత హృదయం లోతులను తెలుసుకోలేము.

భగవన్నామం అను, విచారణతో ఉతుకు, గురుదేవుడు చెప్పింది చెప్పినట్లు ఆచరించు, తరించు. మన యిల్లు మనమే చక్కబెట్టుకోవాలి. ప్రవృత్తి నుండి నివృత్తికి రావాలి. మనస్సు వృత్తి రహితమవ్వాలి. దైవత్వం మనకు విడిగా లేదు. మనలో భాగమై ఉంది. లేకపోతే ఎలా అనుభవించ గలుగుతాము? 'ఉత్తమ పురుష స్త్వన్యః' - ఉత్తమ పురుషుడు పరమాత్మ అని చెప్పబడుతున్నాడు. వారే రాముడు, కృష్ణుడు, మన గురుదేవులు. వారే మూడులోకాలలోనూ నాశరహితుడుగా, కూటస్థుడిగా ప్రకాశిస్తున్నారు.

భగవంతుని పొందాలంటే ఆవేదన ఉండాలి. సంకల్పించే మనస్సు పరమాత్మ నిలయం అని గుర్తించాలి. నిష్కామంగా, నిర్మల మనస్కుడవై, భక్తి భావం పెల్లుబుకుతుండగా, ఆర్తిగా భగవంతుణ్ణి సేవించు. పరమేశ్వరుని ప్రేమాశ్రువులే పూలుగా పూజించు. అంతే కాదు నీ దోషాలను ఆ ప్రభువునకు తెలియజేయి. ఆయన నిన్ను తప్పక రక్షిస్తాడు.

నీ మనస్సు విషయ రహితం చేసుకో. గురుదేవుడు నిన్ను వెన్నంటి ఉన్నాడు. ఏ విధంగా అంటే ఆత్మ దేహమంతా ఆకాశం వలె వ్యాప్తమై ఉన్నట్లు. ఉన్నదానిని మనస్సు చేత గుర్తించు. పరమాత్మ యందు ఏకాగ్రత కలిగి ఉండటమే ధ్యానం.

మౌనం అంటే నోరు మూసుకోవటం కాదు. మనసు మూగపోవాలి. అదే నిజమైన మౌనం.

మడి దేహానికి కాదు, ఆత్మకు కావాలి.

- శ్రీ బాబు

# క్షీర చోరుడు

- కె. భాస్కర రాజు

శ్రీ మాధవేంద్రపురి అనే బెంగాలీ వైష్ణవ సన్న్యాసి, బృందావన యాత్రలో భాగంగా గోవర్ధనగిరికి ప్రదక్షిణ చేసి, ఒక చెట్టు నీడన విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇంతలో ఒక బాలుడు ఒక పాత్రలో అప్పుడే పితికిన ఆవుపాలు తీసుకువచ్చి వారి యెదుట ఉంచి, 'స్వామీ! నేను యీ సమీప గ్రామంలోనే ఉంటాను. మా గ్రామంలో ఏ అతిథి కూడా నిరాహారిగా ఉండటానికి వీలులేదు. మీరు దయచేసి యీ పాలు త్రాగి విశ్రాంతి తీసుకోండి. నేను మళ్ళీవచ్చి యీ పాత్రను తీసుకెళతాను' అని చెప్పి, అక్కడ చెట్లమధ్య అదృశ్యమయ్యాడు.

శ్రీపురి ఆశ్చర్యపోయి, ఆ పాలుత్రాగి కాసేపు అక్కడే ఆచెట్టు నీడన కునుకు తీశారు. ఆ నిద్రలో ఆ బాలుడు వచ్చి, గోవర్ధన ఉద్ధరణ తరువాత శ్రీకృష్ణుడు, తన యొక్క దివ్యమంగళ విగ్రహాన్ని యీ కొండ మీద ప్రతిష్ఠించారు, కాలాంతరంలో అవతార పరిసమాప్తి తరువాత ఏర్పడ్డ క్షోభతో దుర్మార్గుల నుంచి రక్షించటానికి అక్కడగల గ్రామ ప్రజలు ఆ విగ్రహాన్ని దగ్గరలోగల ఒక తోటలో ఉంచారు, నేను నీ కోసం ఎదురు చూస్తున్నాను" అని చెప్పి అదృశ్యమయ్యాడు.

శ్రీ మాధవేంద్రపురి నిద్రలో నుండి మేల్కొని, సమీప గ్రామ ప్రజలను పిలిచి, తనకు వచ్చిన దివ్యదర్శనాన్ని వారికి తెలియజేశారు. ఆ గ్రామ ప్రజలందరూ ఆ కొండను, తోటలను వెతికి ఒక తోటలో చెట్ల మధ్యలో ఉన్న స్వామివారి సజీవ దివ్యమంగళ రూపాన్ని దర్శించుకుని, ఒక చక్కటి మందిరాన్ని నిర్మించి, స్వామివారిని మాధవేంద్రపురి చేతుల మీదుగా తిరిగి ప్రతిష్ఠింపజేసుకున్నారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుండి వేలాదిమంది భక్తులు వచ్చి, కొండల రాసుల ప్రసాదాలు తయారుచేసి నివేదన చేశారు. ఆ గోపాలుడు చాలా కాలంగా నిరాహారంగా ఉండటం వలన తయారుచేసిన కొండల రాసుల ప్రసాదాన్ని స్వయంగా స్వీకరిస్తుంటే మాధవేంద్రపురి సమాధి నిమగ్నుడై ఆ దివ్య దృశ్యాన్ని చూస్తూ ఉండిపోయారు. స్వామివారు ప్రసాద స్వీకరణతో పదార్థాలన్నీ

నిండుకున్నా భక్తజనుల కోసం తన కటాక్షంతో యధాతధ స్థితికి వచ్చాయి.

శ్రీ మాధవేంద్రపురి ఆ క్షేత్రంలో చాలాకాలం శ్రీకృష్ణ సంకీర్తన చేస్తూ ఉండిపోయారు. పూజారులు ప్రతి నిత్యం సాయంకాలం 12 పాత్రలలో క్షీరాన్నం నివేదనచేసి, భక్తులకు పంచిపెట్టి మిగిలిన ప్రసాదాన్ని వారు స్వీకరించేవారు. ఒక రోజు మాధవేంద్రపురికి స్వామివారికి నివేదన చేసే క్షీరాన్నం ఎలా ఉంటుందో రుచి చూడాలనిపించింది. కాని స్వామివారికి నివేదన చేయని ప్రసాదాన్ని రుచి చూడాలనిపించటం మహాపరాధమని భావించి నిరాహారులై ఒక చెట్టు నీడన విశ్రమించారు. ఆ సాయంకాలం నివేదన చేసిన ప్రసాదాన్ని పూజారులు భక్తులందరికీ పంచిపెట్టి, గుడికి తాళాలు వేసి యిండ్లకు వెళ్ళి విశ్రమించారు.

స్వామి వారికి కలలో దర్శనమిచ్చి "ఆలయంలో ప్రసాద పాత్ర ఒకటి ఉండిపోయింది. ఆ పాత్రను తీసుకువెళ్ళి మాధవేంద్ర స్వామికి యివ్వలసినది" అని ఆజ్ఞాపించి అదృశ్యమయ్యారు. పూజారులు మేల్కొని తాము ప్రతిరోజు నివేదన చేసే పాత్రలలో 11పాత్రలు మాత్రమే తమ దగ్గర ఉండటం గమనించి, ఈ కలకు అర్థమేమిటో అని ఆలోచించి, ఎందుకైనా మంచిదని ఆలయానికి వెళ్ళి తలుపులు తీసి చూస్తే, స్వామి వారి పాదాల దగ్గర ఒక పాత్ర ప్రసాదంతో ఉండటాన్ని గమనించి, ఆ పాత్రతో శ్రీమాధవేంద్రపురి దగ్గరకు వెళ్ళి క్షీరాన్నమును నివేదించారు.

శ్రీమాధవేంద్రపురి బాలగోపాలుడు తన కోసం ఒక క్షీరాన్న పాత్రను దొంగిలించి తనకు ప్రసాద రుచి చూడాలన్న తన సంకల్పాన్ని యీ విధంగా తీర్చాడు కదా అని, స్వామిని అనేక స్తుతులతో కీర్తించి, ఆ స్వామిని అప్పటి నుంచి 'క్షీర చోరుడు' అనే నామంతో పిలిచారు.

ఈ ఆయలయాన్ని యిప్పటికి వ్రజవనంలో గోవర్ధన గిరి వద్దగల గోవర్ధన కుండం ప్రక్కన దర్శించి క్షీరచోరుని కృపను పొందవచ్చు.

శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబు ట్రస్ట్ రెసిడెన్షియల్ స్కూలు

(ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ)

అతి తక్కువ ఫీజులతో, ఉత్తమ విద్యాబోధనతో నడుపబడుతున్న 'ఏకైక విద్యా సంస్థ'

అడ్మిషన్లు జరుగుచున్నవి

త్వరపడండి!

కొద్ది సీట్లు మాత్రమే ఉన్నాయి

విద్య అంటే విజ్ఞానము. అది అమ్మబడేది కాదు. కొనబడేది కాదు. అది అనుభవముతో కూడిన అధ్యాపకుల ద్వారా అందింపబడేది. నర్సరీ నుండి ఎల్‌యకె.జి తో సహా టెన్త్‌క్లాసు వరకు తెలుగు, ఇంగ్లీషు మీడియాలలో శిక్షణ ఇవ్వబడుతుంది.

ప్రత్యేకతలు

2012-13 నుండి శ్రీచంద్రకాళీవిద్యానిధి 1మరియు 2 ప్రారంభం

150మంది అర్హులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

- ✶ ప్రశాంత వాతావరణము, ఆధ్యాత్మిక శిక్షణ
- ✶ క్రమశిక్షణ సత్ ప్రవర్తన
- ✶ రెసిడెన్షియల్ ట్యూటర్ల పర్యవేక్షణలో చదివించటము
- ✶ వీక్లీటెస్ట్‌లు, డైలీ అసైన్‌మెంట్లు
- ✶ డేస్కాలర్స్‌కి బస్సు సౌకర్యము
- ✶ బాలబాలికలకు విడివిడిగా హాస్టల్ వసతి
- ✶ నర్సరీ నుండి 1వ తరగతి వరకు ఉచిత మధ్యాహ్న భోజనము అమలు.

సంస్కృత మరియు హిందీ పరీక్షలకు శిక్షణ

మంచి విలువలతో కూడిన తెలుగు, ఇంగ్లీషు, హిందీ గ్రంథాలయము

కంప్యూటర్ ఎడ్యుకేషన్ మరియు సైన్స్ ల్యాబ్ సౌకర్యం కలదు.

<u>గమనిక</u> - స్కూలు ది. 4-6-2014న తెరువబడును. వివరములకు కరస్పాండెంట్ గారిని స్వయంగా గాని, ఫోన్ ద్వారా గాని సంప్రదించవచ్చు. లేదా వారికి వివరముల కొరకు వ్రాయండి.

Contact :
(Dr. K.V.R. Ramana, M.Sc., Ph.D., Head, FVT & Dy. Director (Rtd)
C.FT.R.I. MYSORE.)
Correspondent,
Phone : 0863-2594211 (S); 0863-2293824(H)
Cell 93932 20400; 94411 27078;

# శ్రీదత్తాత్రేయ పరశురామ సంవాదము

- పరాశర ప్రసాద్

శ్రీ పరశురాముడు దత్తగురుదేవులు చెప్పిన సమాధానముతో సంతృప్తి నొందక, ఇంకా ప్రశ్నిస్తూ "శుద్ధ చైతన్యం వివిధ రూపాలలో ప్రకాశిస్తోందని మీరు చెప్పారు కదా! చితి అనే చైతన్యము, చైతన్యముచే ప్రకాశింప బడేది అని రెండు ఉన్నాయి కదా. అంటే కాంతి చేత ప్రకాశింపబడే వస్తువు, కాంతికి భిన్నమనే విషయం అనుభవానికి అందటం లేదు. అంతే కాదు సంకల్పాలను జయిస్తే నిర్వికల్ప సమాధి సిద్ధిస్తుంది అని అందరూ భావిస్తారు కదా.



మనస్సు ఆత్మజ్ఞానానికి సాధనం కదా. మనసు లేకుండా ఆత్మజ్ఞానం కలగదు కదా. ఆ స్థితిలో ఆత్మ చేతనము, ప్రకాశ రూపము ఎలా అవుతుంది? మనస్సు ద్వారానే బంధమోక్షాలు కలుగుతాయని అందరూ విశ్వసిస్తున్నారు కదా. సవికల్పమైన మనసు బంధము, నిర్వికల్పమైన మనసు మోక్షము అయినప్పుడు జ్ఞానాన్ని పొందటానికి మనస్సు కారణమని అంగీకరించాలి కదా. అంతేకాదు ఆత్మ దృక్కు అయి, ప్రపంచం దృశ్యమై ఐక్యత సిద్ధించినా కారణమైన మనస్సు విడిగా ఉంటోంది కదా. ఆ స్థితిలో ద్వైతమేకాని అద్వైతానికి తావెక్కడ? మనస్సు నిర్వికల్పమైనా మనస్సు, ఆత్మ అనేవి రెండు ఉంటే ద్వైతమే కదా!



ప్రపంచం అనేది భ్రాంతి అని భావించినా, భ్రాంతి అసత్యం ఎలా అవుతుంది? పోనీ రజ్జులోని సర్పము అసత్యమే. అంగీకారమే. కాని ప్రపంచంలోని అన్ని వస్తువులు స్థిరంగా ఉంటున్నాయి. వాటివల్ల ప్రయోజనం కూడా ఉంది. ఆ స్థితిలో ధృశ్యం తన్నశ్యం అని, జగత్తు మిథ్య అని భ్రాంతి అనటం ఎంతవరకు సమంజసం? అందరికి ప్రపంచం అంతా ఒకేరకమైన భ్రాంతిగా ఎలా గోచరిస్తుంది? ప్రపంచం అంతా ఒకే దృశ్యంగా, సత్యంగా, అందరికీ ఒకే విధంగా గోచరించటమనేది విచిత్రంగా ఉంది గురుదేవా! యీ సందేహాలు నన్ను పీడిస్తున్నాయి. వీటిని మీరే నివృత్తి చేయండి" అని ప్రార్థించిన పరశురాముని ప్రశ్నలకు సంతోషించి, దత్తగురువులు "ప్రశ్నలు ఉద్భవిస్తేనే జ్ఞానం కలుగుతుంది. అదే విచారణకు నిదర్శనం. ప్రశ్నించని శిష్యుని మనోమాలిన్యం తొలగదు. అది సాధనకు అవరోధంగా ఉంటుంది. సంశయాత్మకుడు ఎన్నడూ తరించడు. సంశయ నివృత్తియే మోక్షానికి తొలిమెట్టు" అన్నారు.

# ముముక్షువు వెంకట రమణ ప్రసాద్

- పరాశర ప్రసాద్

డా॥ వి.వి.ఆర్ ప్రసాదరావుగారు సద్గురుదేవుల సమాశ్రయం లభించిన మరుక్షణం నుంచి సాధనారూఢులై, సద్గురుదేవుల అనుగ్రహానికి పాత్రులై, ఆశ్రమవాసులై, గురుసేవా కార్యక్రమాలలో పాల్గొని, తమ పార్థివ దేహాన్ని వదలి గురుసాయుజ్యాన్ని పొందిన విషయం ముముక్షువులు అందరికి తెలిసిన విషయమే. సద్గురుదేవులు వారి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులందరకి శాంతిని ప్రసాదించి రక్షించు గాక అని ప్రార్థిస్తూ.........

గురుసాంప్రదాయంలో వారు వెంకట రమణ ప్రసాద్‌గా, మన సద్గురుమాసపత్రిక ఎడిటోరియల్ బోర్డు సభ్యునిగా అపారమైన సేవను అందించిన విషయం అందరికీ సుపరిచితమే.

ప్రసాదరావుగారు ప్రథమంగా నాగార్జున విశ్వవిద్యాలయంలో తమ ఉద్యోగవిషయమై వెళ్ళి అక్కడ తాము ఆశించిన విధంగా వ్యవహారం జరగని కారణంగా నిరాశచెంది, తిరుగు ప్రయాణంలో కాళీవనాశ్రమంలో తన ప్రియ మిత్రుని కలుసుకొనే నిమిత్తం నంబూరు రైల్వేస్టేషన్ వద్ద దిగి మండుటెండలో కాలి నడకన ఆశ్రమాన్ని చేరటం జరిగింది. ఆశ్రమంలో తన మిత్రుని యిల్లు తాళం వేసి ఉండటం, ఆ సమయంలో సద్గురుదేవులు ధనుర్మాస కార్యక్రమంలో ఉండటం, ప్రసాద రావుగారు ఆ సమావేశానికి హాజరుకావటం అంతా కాకతాళీయంగా జరిగిపోయాయి.

సద్గురుదేవులు ఆ సమయంలో బలిచక్రవర్తి వామనమూర్తిని చూసి పొందిన భావనలను వర్ణిస్తున్నారు. శ్రీ సద్గురుమూర్తి బోధామృతానికి ముగ్ధులైన ప్రసాదరావుగారు తన్మయులై సభలో కూర్చుండిపోయారు. ఇంతలో మిత్రులు వెంకటరత్నంగారు ప్రసాదరావుగారిని గురుదేవులకు పరిచయం చేశారు.

అప్పటికే ప్రసాదరావుగారు డిగ్రీ కాలేజీలో ఇంగ్లీషు డిపార్ట్‌మెంట్ అధిపతిగా, పిహెచ్.డి, యింకా ఎన్నో విద్యార్హతలు ఉన్నాయి. ఆయన అష్టావధాని. వీటన్నిటి కారణంగా మానవాకారంలో ఉన్న యింకొక వ్యక్తికి సాష్టాంగ నమస్కారం చేయటం ఎలా? అక్కడ పండితాహంకారం. దానినే

గురుదేవులు వరాహంకారము అనేవారు. ప్రసాద్‌రావుగారు ఆలోచించి, నమస్కారం చేయకపోవటం సభామర్యాదకు భంగం కలుగుతుందేమో అని ఆలోచించి, చేతులు జోడించి, శిరస్సు వంచి, సద్గురుదేవులకు నమస్కరించారు. సద్గురుదేవులు తమ హస్తంతో వారి మెడమీద చరిచే సరికి వారి శిరస్సు గురుదేవుల పాదస్పర్శని చవి చూసింది. ఆ క్షణంలో ఆయన ఒక అలౌకికమైన ఆనందాన్ని అనుభవించారు. తనని తాను మరచిపోయారు. దేహభావన, ఇంద్రియ భావన లేదు. ఆఖరుకు తానెవరో, తన పేరేమిటో కూడా తెలియని ఒక స్థితి!

అదే క్షణంలో వెంకటరత్నంగారు శ్రీసద్గురు దేవులకు ప్రసాద్‌రావు గారిని పరిచయం చేస్తూ, ఆయన భాగవత ప్రవచనం చక్కగా చేస్తారని, చెప్పారు. వెంటనే శ్రీసద్గురుదేవులు ఆయనని భాగవతంలో ఏదైనా ఒక ఘట్టం చెప్పమన్నారు. కాని ప్రసాదరావుగారు మాత్రం ఏమీ మాట్లాడే స్థితిలో లేరు. అదీ సద్గురుదేవులతో ఆయన ప్రథమ సమావేశము.

-సశేషం



సుమతీ! పాలలో కలిసిన నీరు పాలవలె పైకి కనిపించును. కానీ జాగ్రత్తగా పరిశీలించినచో పాలరుచిని తగ్గించును. అట్లే చెడు ప్రవర్తనగల వానితో స్నేహము స్వగౌరవమును కూడా పోగొట్టును. కావున దుర్జనునితో స్నేహము చేయకూడదు.

(సుమతీ శతకము/79)

# సత్సంగామృతం

- మురళీ

(శ్రీబాబూజీ మహరాజ్‌వారి రజతోత్సవ మహాపుణ్యారాధన మహోత్సవాలలో భాగంగా ది.27-11-2013 బుధవారంనాడు పూజ్యశ్రీ మాతాజీ అందించిన బోధామృతం సంక్షిప్తంగా)

ప్రపంచం అంతా ద్వైతం కూడి ఉన్నది. కాని, ద్వైతం కూడా అద్వైతం లోదే. అద్వైతమనేది ఎప్పుడూ ప్రకాశిస్తోంది. దాంట్లో ద్వైతం అనే జగత్తు మధ్యలో చేరింది. ఉన్నట్లుగా భ్రాంతి జనితం చేస్తోంది. కాని, మూలాన్ని గుర్తించి, శ్రీ గురుదేవులు ప్రసాదించిన సూచనలను అనుభవిస్తూ ఉంటే, ఎంత ప్రపంచం ఉన్నా, ఎంత జగత్తు ఉన్నా మనది మనకే ఉంటుంది. మన సాధన, మన అనుభూతి ఎవరిది వారికే. శ్రీ గురుదేవులు దీనిని 'అనుభవైకవైద్యం సుమా' అని అంటుండేవారు. భగవదనుభూతి ఎంత చెప్పినా యింకొకరికి అర్థమయ్యేది కాదు. ఆ పాత్ర ఎంతో గొప్పదైతే గాని అర్థం చేసుకోలేరు. తను అనుభవించి ఉంటే వదిలి పెట్ట గలడా దాన్ని? అందుకనే తను అనుభవించి తీరాలి. అందుకే 'సత్యము అనుభవించేది'. మనకి ఆ అనుభవాన్ని ప్రసాదించేవారు సద్గురుదేవులు. 'ధర్మము ఆచరించేది'. నాలుగు రోజులు గురువుల సన్నిధి మనకి ప్రత్యక్షంగా దొరికింది.

గురుపదాంభోజముల్ గొలువక కల్గునే
ప్రవిమల వైరాగ్య భాగ్య మహిమ
గురుపాద తీర్థంబు గ్రోలక కల్గునే
జ్ఞానవిజ్ఞాన యోగానుభవము
గురు సుప్రసాదంబు గొనకున్న గల్గునే
ప్రతిలేని చిత్తోపరతి సుఖంబు
గురుతత్వ మాత్మగన్గొనకున్న గల్గునే
నిరతిశయంబైన పరమపదము
అట్లుగావున విద్యార్థియైన యోగి
వినయ భయభక్తులెద లోన బెనగొనంగ
నల చతుర్విధ శుశ్రూషలాచరించు

కొనుచు ననిశంబు గురువుల గొలుచు ననఘ!

గురువులంటే సామాన్యమా? ఈ ప్రపంచంలో అన్నిటిని చూసే కళ్ళతో చూసి, మనల్ని అనుగ్రహించటానికి వచ్చిన గురువులను, మనకు కనిపిస్తున్నారు కదా అని తక్కువ అంచనా వేస్తున్నాం. పరమాత్మ, సాక్షాత్తు ఈశ్వరుడే నడిచి వచ్చిన గురుదేవుడు, మనలను ఉద్ధరించటానికే వచ్చినవారు అని ఎంత మంది అర్థం చేసుకోగలుగుతున్నారు? కాలం గడిచిపోయిన తరువాత అయ్యయ్యో ఎంత పొరపాటు చేశాను. ఆ మహానుభావులు ఉన్నంత కాలం గుర్తించలేకపోయామని ఎంత అనుకుంటే మాత్రం ఏం లాభం?

మహానుభావులు మహావాక్యాలను మనకు ప్రబోధన చేస్తూ, చెబుతూ చెబుతూ 'ఇది మారిపోయేటటువంటిదే కాని, మారనటు వంటిది కాదు' మారనటువంటిది ఒకటే ఉంది అది నువ్వే, నీ స్వరూపమే. నువ్వు ఏదై ఉన్నావో దానికోసం ఆవేదన పడు. మహాత్ములు మనకు హెచ్చరిక చేయకపోతే మనం యీ రోజున యిలా ఉండేవాళ్ళం కాదు. పురాణాల్లో, ఇతిహాసాల్లో చాలా చదువుతూ ఉంటాం. దేవుడు ఎక్కడ ఉన్నాడు అంటే అందరి హృదయాలలోనూ ఉన్నవాడే. ప్రకాశించే వాడే. ఎవరికీ కాకుండా మాత్రం లేడు. ఎవరికీ కాకుండా ఉంటే దేవుడు అవడు. అందుబాటులో ఉన్న దేవుడిని అందుకునే సామర్థ్యాన్ని మనం పెంపొందించుకోవాలి. తన్ను తాను గుర్తిస్తే, గురుదేవుని దివ్య చరణార విందాలను యీ హృదయంలోనే ఆస్వాదిస్తూ ఉండవచ్చు.

గురుపదాంభోజముల్ గొలువక ...... గురువు దగ్గర మంత్రదీక్ష తీసుకుంటే అయిపోతుందా? వారి ముఖస్తుగా వెలువడిన వాక్కుల ద్వారా వారి పదములను మన మనస్సులో భద్రపరచుకుంటే, వారి వాక్కుల సారాంశాన్ని ఆచరణలో పెడితే, మన జీవితంలో మార్పు తీసుకు రావటానికి కారణమై ఉన్నాయి. ఆఖరికి భగవానుడు కూడా గురువును ఆశ్రయించే ఉన్నాడు. రాముడు, కృష్ణుడు కూడా గురువును ఆశ్రయించారు. గురు కృపను సాధించాలని చూపించారు.

-సశేషం

PRICE LIST

# సమర్థ సద్గురు పబ్లికేషన్స్

## శ్రీ కాళీగార్డెన్స్ - 522508, నంబూరు

## గుంటూరు జిల్లా. ఫోన్: 0863-2293206

**తెలుగు పుస్తకములు:**

| | | | |
|---|---|---|---|
| 1. | శ్రీ భగవద్గీత సాధనా దీపిక | 3 భాగములు | రూ: 120.00 |
| 2. | శ్రీ సద్గురునాధుని దివ్య చరిత్ర | 1వ భాగము | 90.00 |
| 3. | శ్రీ సద్గురునాధుని దివ్య చరిత్ర | 2వ భాగము | 100.00 |
| 4. | శ్రీ బాబూజీ | | 80.00 |
| 5. | శ్రీ గురుగీత | | 80.00 |
| 6. | శ్యామసుందరా ఒక్కసారి.... | | 50.00 |
| 7. | సంత్‌నామదేవ్ | | 50.00 |
| 8. | వార్తాలాపము | 1వ భాగము | 50.00 |
| 9. | వార్తాలాపము | 2వ భాగము | 50.00 |
| 10. | భజనమాల | | 70.00 |
| 11. | భజనమాల | 1వ భాగము | 25.00 |
| 12. | గురువాణి | 1వ భాగము | 25.00 |
| 13. | గురువాణి | 2వ భాగము | 10.00 |
| 14. | శ్రీ బాబూజీ బోధామృతం | 2వ భాగము | 10.00 |
| 15. | శ్రీ బాబూజీ బోధామృతం | 3వ భాగము | 10.00 |
| 16. | శ్రీ బాబూజీ దివ్యస్మృతులు | 2,3,6, భాగములు ఒక్కటికి | 10.00 |
| 17. | శ్రీ బాబూజీ దివ్యస్మృతులు | 8,9 భాగములు ఒక్కటికి | 15.00 |
| 18. | సద్గురు లేఖ సుధ | | 10.00 |
| 19. | ధ్యాన శ్లోకమంజరి | | 20.00 |
| 20. | తత్వార్ధచంద్రిక (పాతది) | | 5.00 |
| 21. | తత్వార్ధచంద్రిక | 2వ భాగము | 25.00 |
| 22. | కైలాస మానస సరోవరయాత్ర | | 20.00 |
| 23. | బాబుమాట అమ్మనోట | | 15.00 |
| 24. | ధ్యానం | | 15.00 |
| 25. | స్తుతి మంజరి | | 20.00 |
| 26. | గురుధ్యానదీపిక | | 15.00 |
| 27. | గురురామకోటి | | 10.00 |

| | | |
|---|---|---|
| 28. శ్రీ గురుగీత | | 10.00 |
| 29. భక్తిపుష్పము | | 10.00 |
| 30. శ్రీ బాబూజీ సహస్రనామాలు | | 8.00 |
| 31. శ్రీ మాతాజీ సహస్రనామాలు | | 8.00 |
| 32. సుప్రభాతం - ప్రార్థన | క్రొత్తది | 6.00 |
| 33. సుప్రభాతం - ప్రార్థన | పాతది | 4.00 |
| 34. బాబు తత్వం అమ్మనోట | | 5.00 |
| 35. నమస్కార స్తోత్రం | | 5.00 |
| 36. ముకుందమాల | | 5.00 |
| 37. శ్రీ దేవీ స్తోత్రరత్నమాల | | 5.00 |
| 38. దివ్యసన్నిధి | | 5.00 |
| 39. గురువే భగవంతుడు | | 5.00 |
| 40. ప్రార్థన - సుప్రభాతం | హిందీ | 5.00 |
| 41. చిన్న పుస్తకములు | ఒక్కటికి | 2.00 |
| 42. శ్రీశ్రీశ్రీ బాబూజీ సహస్రనామ అష్టోత్తర శతనామావళి (లఘు వ్యాఖ్యానము) | | 40.00 |

**ENGLISH BOOKS**

| | | |
|---|---|---|
| 1. Divine memories of Sri Babuji | 2parts each | 10.00 |
| 2. Divinity in Human Form | | 10.00 |
| 3. Guru is God | | 5.00 |
| 4. Gospel of Meditation | | 10.00 |
| 5. Samardha Sadguru | | 50.00 |
| 6. Small books | each | 2.00 |

**C.D'S**

| | | | |
|---|---|---|---|
| 1. Sri Mataji Bhajans (VCD) | 13NOs | each | 40.00 |
| 2. Sri Mataji Sankirtans (MP3 CD's) | 2NOs | each | 40.00 |
| 3.Sri Babuji's Bodhamrutam (3CD set) | 3NOS | each set | 100.00 |

and others Bhajans etc., CD's and DVD's are also available. each CD costs Rs.40/-,50/- and DVD costs Rs.75/-, 100/-

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

గత సంచిక తరువాయి

- విజయేశ్వరానంద ప్రసాద్

## శ్రీ లలితానంద సరస్వతి స్వామి (గురువుగారి)తో శ్రీబాబు

జ్ఞాని నిస్సంకల్పుడని, నిర్వికారుడని, అతని జీవితం స్వచ్ఛమైన తెల్లని కాగితం వంటిదని శ్రీబాబు గురువుగారితో ఒకసారి జ్ఞాని లక్షణాలు గురించి మాట్లాడుతూ చెప్పారు. జ్ఞానిలో తాను జ్ఞానిననిగాని, పరమాత్మ అనిగాని ఎటువంటి భావనా ఉండదు. అటువంటి జ్ఞానికి సర్వ వ్యాపకత్వము, సర్వజ్ఞత్వము సహజ లక్షణాలుగా ఉంటాయి. జ్ఞాని ఎన్నడూ మహిమలు చూపడు. ఆ మహాత్ముని సన్నిధిలో మహామహిమలు కూడా అతి సహజంగా జరుగుతాయి. కాని జ్ఞాని సాక్షి మాత్రంగానే ఉంటాడు. నిజానికి ఆ మహిమలను గూర్చిన స్పృహ కూడా అతనికి ఉండదు.



శ్రీబాబు - అటువంటి మహాత్ముడిని మీరు ఎవరినైనా చూశారా?

గురువుగారు - ఎవరో ఎందుకు, మీరే ఉన్నారు కదా?

శ్రీబాబు - అటువంటి మహాత్ముల సాంగత్యం వలన కలిగే ఫలితమేమిటి?

గురువుగారు - అన్నిటికన్న ఉత్తమ ఫలితం జన్మ రాహిత్యమే కదా!

శ్రీబాబు - అయితే మీకు పునర్జనమ్మ ఉన్నదంటారా? లేదంటారా?

గురువుగారు - పునర్జన్మ ఉన్నదా లేదా అనే చింతన నాకు లేదు. నాకు పునర్జన్మ ఉంటే, నా కోసం మళ్ళీ మీకు అవతారం తప్పదు. ఆ అవసరం మీకు ఉన్నదో, లేకుండానే చేసుకుంటారో అది తమ నిర్ణయమే.

శ్రీబాబు 'ఆనందపడుతూ మొత్తానికి నియోగి బిడ్డవనిపించావే!' అన్నారు. జ్ఞాని సర్వజ్ఞుడని, సర్వవ్యాపని అనేక అనుభవాల ద్వారా ఋజువు చేసి, శ్రీబాబు గురువుగారి మనసులో యింకేమైనా సంశయ శేషం ఉంటే దాన్ని పటాపంచలు చేసి, ఆమె త్రికరణ శుద్ధిగా, శ్రీబాబు యెడల నిశ్చయ, పరిపూర్ణ గురుభావాన్ని పొందేందుకు సదావకాశం కల్పించారు. ఇందిర స్వానుభవాలతో ఆ నిశ్చయాన్ని ముందే పొంది ఉన్నది.

శ్రీబాబు ముఖ వర్చస్సు జగన్మోహనంగా ఉండేది. "ఇది ఆయన ధరించిన దుస్తుల వల్ల, ఆభరణాల వల్ల వచ్చిందా? లేక సహజమైనదా?" అని ఒకసారి గురువుగారి మనస్సులో ఆలోచన మెదిలింది. అంతలోనే శ్రీబాబు స్నానానికి వెడుతూ ఒక తుండుగుడ్డ కట్టుకుని ఆమె వద్దకు వచ్చారు. గురువుగారు స్వామి వంక చూసేసరికి, నీలమేఘ ఛ్ఛాయతో మెరిసే తేజస్సుతో, మధుర మందహాసంతోను స్వామి గుమ్మం వద్ద నిలబడి ఉన్నారు.

గురువుగారు కంగారుపడి, 'స్నానానికి వెడుతూ యిటు వచ్చారా? రండి లోపలికి' అన్నారు. "మీరు ఉన్నఫలాన రమ్మని పిలిచి నట్లు అనిపించి, యిలా వచ్చేశాను. చూశారుగా! ఇహ వెడతాను" అని వెళ్ళిపోయారు. సర్వాంతర్యామికి తెలియనిదేముంటుంది?

ఒకనాడు గురువుగారు బట్టలు ఉతుక్కుంటూ దొడ్లో పక్కనే ఉన్న చిక్కుడుపాదు వంక చూశారు. ఆమెకు యథాలాపంగా భాగవతం లోని ..................

చిక్కడు సిరి కౌగిటిలో
చిక్కడు సనకాది యోగి చిత్తములందున్
చిక్కడు శ్రుతి లతికావళి
చిక్కెనతడు లీల తల్లి చేతన్ ఱోలన్ ॥

అన్న పద్యం గుర్తుకు వచ్చింది. ఆమె ఆ భావంలో తన్మయత్వాన్ని పొందుతూ, ఆ పద్యాన్ని తనలో తాను చదువుకుంటున్నారు. అంతలో శ్రీబాబు అక్కడకు వచ్చారు.

గురువుగారు - ఇలా వచ్చారేమిటి బాబూ?

శ్రీబాబు - మరేం చెయ్యను? చిక్కుడు పాదు దగ్గర కూర్చుని, 'చిక్కడు చిక్కడు' అని మాటిమాటికి అంటున్నట్లు వినిపించింది. 'చిక్కుడు' అంటున్నారో, 'చిక్కడు' అంటున్నారో అడుగుదామని వచ్చాను.

గురువుగారు - అదేమిటి బాబూ? నేను ఆ మాటలు పైకి అనలేదే! లోపలనే ఉనుకుంటున్నాను. మీరు మీ గదిలోనే ఉన్నారు కదా!

-సశేషం

విష్ణు  కథలు

–రమణ ప్రసాద్

# 8. సదాశివ బ్రహ్మేంద్ర సరస్వతి

కావేరీ నది సమీపాన తిరుచునాపల్లి లో నెరూరు అనే గ్రామంలో ఒక దేవాలయం ఉంది. అందులోకి ప్రవేశించగానే శివలింగ దర్శనము, దాని వెనుక బిల్వవృక్షము, దాని ఛాయలో మృత్తిక లింగము దర్శనమిస్తాయి. ఆ పవిత్ర సన్నిధానమే జీవన్ముక్తులైన శ్రీ సదాశివ బ్రహ్మేంద్ర స్వాముల వారి సమాధి ప్రదేశము.



సదాశివబ్రహ్మేంద్రుల వారు ఆత్మజ్ఞానులైన పూర్ణ పురుషులు. శుద్ధ పరాత్పరులు. మోక్ష సోమసుందర అవధాని అనే బ్రాహ్మణుడు. ఆంధ్రప్రాంతం నుండి కదిలి కుంభకోణం సమీపంలో స్థిరపడి పోయారు. ఆయన గొప్ప పండితుడు. ఆయన భార్య పార్వతమ్మ. వారికి సంతానం లేదు. సంతానంకోసం భగవంతుని ప్రార్థించారు. భగవత్కృపచేత వారికి ఒక పుత్రుడు కలిగాడు. అతనికి “శివరామకృష్ణ” అని నామకరణం చేశారు.

అతను పెరిగి పెద్దవాడయ్యేకొద్దీ అతడు బాహ్యవిషయాలను పట్టించుకోకుండా ఎప్పడూ అంతర్ముఖుడై ఉండేవాడు. ధ్యానమగ్నుడై కనిపించేవాడు. సకల శాస్త్రాలను అభ్యసించాడు. శాస్త్రాలలోని తాత్త్విక రహస్యాలను జీర్ణించుకున్నాడు. సునిశిత ప్రజ్ఞావిశేషాలతో ప్రకాశించేవాడు. శివరామకృష్ణకు యుక్తవయస్సు వచ్చింది. అతనిలో వైరాగ్యజ్వాల తివ్రరూపం దాల్చింది. భగవంతుని పొందటానికే మానవ జన్మవచ్చింది అని అది సన్యాస ఆశ్రమం స్వీకరించటం ద్వారా సులభసాధ్యమని అది కూడా బ్రహ్మచర్యాశ్రమం నుండే సన్యాస ఆశ్రమం స్వీకరించాలని అభిప్రాయపడ్డాడు.

అది గ్రహించిన అతని తల్లిదండ్రులు అతనికి వివాహం చేయ

నిశ్చయించారు. శివరాముడు దానికి అంగీకరించ లేదు. తల్లిదండ్రులు పట్టుపట్టడంతో వివాహానికి అంగీకరించాడు. అతడికి పదిహేడేళ్ళ వయస్సులో వివాహం అయింది. అతనిలోని వైరాగ్యజ్వాలను వివాహమను తొలకరి జల్లు ఆర్ప లేక పోయింది.

శివరామకృష్ణ భార్య పుష్పవతి అయింది. షడ్రసోపేతంగా పిండివంటలు చేస్తున్నారు. శివరామకృష్ణకు బాగా ఆకలివేసింది. నాకు అన్నం త్వరగా వడ్డించమన్నాడు. కొంతసేపు ఆగమన్నారు. నాకు పిండివంటలు అవసరంలేదు, మామూలు భోజనం వడ్డించండి చాలు అన్నాడు. "కొంచెం సేపు ఆగు అక్కడే ఉండు లోపలికి రావద్దు" అని అన్నారు. ఆ అన్నది తనకు కన్యాదానం చేసిన అత్తగారు.

పరిణామ క్షణం రావాలే గాని ఒక్క మాట చాలు మనిషిని మార్చటానికి. "అక్కడే ఉండు, లోపలికి రావద్దు" అన్న మాటకు "నిజమే! నిస్సారమైన సంసార జీవనంలో ప్రవేశించవద్దు" అని నాకు తెలియ జేస్తున్నారు. నేను జ్ఞాన సముపార్జనకు ప్రయత్నించాలి" అని యోచిస్తూ క్షణమైనా అక్కడ నిలవకుండా బాణంలా దూసుకుంటూ వెళ్ళి పోయాడు. బంధువులంతా వెతికారు. మిత్రులు అన్వేషించారు ఫలితం శూన్యం.

తీవ్ర వైరాగ్యతో బయల్దేరిన శివరామకృష్ణ సత్యాన్వేషణలో ఉన్నాడు. ఆకలైతే భిక్షకువెళ్ళేవాడు. తనదోసిటనే బిక్షా పాత్రగా పట్టేవాడు. భగవానుని తన హృదయంలో భావించుకుని సదా ధ్యానం చేసేవాడు. తన మనోమందిరాన్ని పూజ గదిగా నిర్మించుకొని భగవానుని పూజింపసాగాడు. ఈ మానసిక పుజను "శివ మానసిక పూజ" అనే కీర్తనలో చక్కగా వ్రాశారు.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL